


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి బుధవారం 08-02-2023 సంపుటి : 04 సంచిక : 145 పేజీలు : 4 వెల : రూ 3-00


# సీఎం జగన్ అధ్యక్షతన ఎస్ఐపీసీ భేటీ..



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశమైంది.తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో పలు భారీ పరిశ్రమల ప్రతిపాదనకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు సీఎం జగన్ మాట్లాడుతూ.. పరిశ్రమలు పెట్టేవారికి చేదోడుగా నిలవాలని ఆదేశించారు. అనుకున్న సమయంలోగా నిర్మాణాలు పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశించుకున్న సమయంలోగా వాటి కార్యకలాపాలు ప్రారంభం కావాలని తెలిపారు.రానున్న ప్రతి పరిశ్రమలో కూడా ప్రభుత్వం చేసిన చట్టం ప్రకారం 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే రావాలని సీఎం జగన్ మరోసారి స్పష్టం చేశారు. ఆ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక. విద్యుత్ ప్రాజెక్ట్‌ల విధానంలో కీలక మార్పులు తీసుకు వచ్చామని పేర్కొన్నారు. పవర్ ప్రాజెక్టుల ద్వారా తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికే ఆదాయం వచ్చే పరిస్థితులు తీసుకువచ్చామన్నారు.తీసుకుంటున్న భూమికి ఎకరాకు ఏడాదికి రూ.31వేలు లీజు కింద చెల్లింపులు వచ్చాయన్నారు సీఎం జగన్. దీనివల్ల కరవు ప్రాంతాల్లోని రైతులకు చక్కటి మేలు జరుగుతుందని తెలిపారు. అంతేగాక ప్రతి మెగావాట్‌కు లక్ష రూపాయల చొప్పున రాష్ట్రానికి కంపెనీలు చెల్లిస్తున్నాయని పేర్కొన్నారు. ఎస్జీఎస్టీ రూపంలో కూడా రాష్ట్రానికి రెవెన్యూ వస్తుందన్నారు. గ్రిడ్ బాధ్యతలు కూడా రాష్ట్రానికి లేవని.. దీంతో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు.

## పలు భారీ పరిశ్రమల ప్రతిపాదనకు ఆమోదం

మరిన్ని ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదం

1. కృష్ణా జిల్లా మల్లవల్లి పార్కులో ఇథనాల్ఇంధన తయారీకి ముందుకు వచ్చిన అవిశా ఫుడ్స్ మరియు ఫ్యూయెల్స్ కంపెనీ ప్రతిపాదన.మొత్తంగా రూ.498.84 కోట్ల పెట్టుబడి, ప్రత్యక్షంగా, పరోక్షంగా 3,300 మందికి ఉపాధి. రోజుకు 500 కిలో లీటర్ల సామర్థ్యం ఈ ఏడాది జూన్ లో పనులు ప్రారంభించి, వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తిచేయాలని లక్ష్యం.2. కడియం వద్ద ఆంధ్రా పేపర్ మిల్స్ విస్తరణ ప్రాజెక్టు. మొత్తంగా రూ. 3,400 కోట్ల పెట్టుబడులుప్రత్యక్షంగా 2,100 మందికి ఉద్యోగాలు. 2025 నాటికి పూర్తిచేయాలని లక్ష్యం.3. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద న్యూ ఎనర్జీ పార్కుమొదటి విడతలో రూ.55వేల కోట్లు, రెండో విడతలో రూ.55వేల కోట్లు పెట్టుబడి.మొత్తంగా రూ.1,10,000 కోట్ల పెట్టుబడి.ఫేజ్ వన్‌లో 30 వేలమందికి, ఫేజ్ టూ లో 31వేల మందికి ఉద్యోగాలు. మొత్తంగా 61వేల మందికి ఉద్యోగాలు. ఈ పార్క్ లో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్అమ్మోనియా, గ్రీన్ మిథనాల్, హైడ్రోజన్ సంబంధిత ఉత్పత్తులు.మొదటి విడతను 2027 నాటికి, రెండో విడతను 2033 నాటికి పూర్తిచేయాలని లక్ష్యం. ఇంధన రంగంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు మార్చుకుని కొత్త తరహా ఇంధనాల ఉత్పత్తి లక్ష్యంగా ముందడుగు వేస్తున్న ఎన్టీపీసీ.4. శ్రీకాళహస్తి, పుంగనూరుల్లో ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్. ఫ్యాక్టరీలు.డీఐ పైపులు, ఫెర్రో అల్లాయిస్ తయారీశ్రీకాళహస్తిలో రూ.915.43 కోట్ల పెట్టుబడ, పుంగనూరులో రూ.171.96కోట్లు పెట్టుబడి. మొత్తంగా రూ. 1087 కోట్ల పెట్టుబడి.ప్రత్యక్షంగా 2,350 మందికి ఉద్యోగాలు. డిసెంబర్2023 నాటికి ఫ్యాక్టరీ నిర్మాణ పనులు పూర్తిచేయాలని లక్ష్యం.5. రామాయపట్నంలో అకార్డ్ గ్రూప్ ఫ్యాక్టరీ.రూ. 10వేల కోట్ల పెట్టుబడి.కాపర్ కాథోడ్, కాపర్ రాడ్, సల్ఫ్యూరిక్ యాసిడ్, సెలీనియం మరియు ప్రత్యేక ఖనిజాల తయారీ.ప్రత్యక్షంగా 2500 మందికి ఉద్యోగాలు. మే 2023లో ప్రారంభమై, జూన్2025 నాటికి పూర్తిచేయాలని లక్ష్యం. ప్రభుత్వం రాష్ట్రంలో బాక్సైట్ తవ్వకాలను నిషేధించిన నేపథ్యంలో తమ కంపెనీ ప్రణాళికలను మార్చుకున్న జేఎస్‌డబ్ల్యూ అల్యూమినియం లిమిటెడ్ ఫ్యాక్టరీ కోసం ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరించిన 985 ఎకరాల భూమిలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు ప్రతిపాదన ఆమోదించిన ఎస్ఐపీబీ6. కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో విండ్, సోలార్ పవర్ ప్రాజెక్టులు1000 మెగావాట్ల విండ్, మరియు 1000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులుఏర్పాటు చేయనున్న ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్.నాలుగు విడతల్లో మొత్తంగా రూ.10,500 కోట్లపెట్టుబడి. 2వేలమందికి ఉద్యోగాలు.దశల వారీగా పూర్తిస్థాయిలో మార్చి 2027 నాటికి పూర్తిచేయాలని లక్ష్యం.

7. విశాఖపట్నంలోని కాపులుప్పాడలో మరో 100 మెగావాట్ల డేటా సెంటర్.100 మెగావాట్ల డేటా సెంటర్ ను ఏర్పాటు చేస్తున్న వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్ .మొదటి విడతలో 10 మెగావాట్లతో డేటా సెంటర్, మూడేళ్ళలో పూర్తికి కంపెనీ సన్నాహాలు.మొత్తంగా రూ.7,210 కోట్ల పెట్టుబడి, ప్రత్యక్షంగా 14,825 మందికి, పరోక్షంగా 5,625 మందికి, మొత్తంగా 20,450 మందికి ఉద్యోగాలు.ఇప్పటికే ఏర్పాటు చేస్తున్న 200 మెగావాట్ల డేటా పార్క్ కి ఇది అదనం.8. రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు వచ్చిన వింగ్‌టెక్ మొబైల్ కమ్యూనికేషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌రూ. 1489.23కోట్ల పెట్టుబడి. తిరుపతిలో పరిశ్రమ.15 వేలమందికి ఉద్యోగాలు.టెలీ కమ్యూనికేషన్ఇంటిగ్రేషన్, సెమికండక్టర్, ఆప్టికల్ మాడ్యూల్స్ ను తయారుచేస్తున్న కంపెనీ.9. భోగాపురంలో 90 ఎకరాల స్థలంలో ఐటీ పార్కు ఏర్పాటు.దీనికి ఎస్ఐపీబీ ఆమోదం.అత్యంత ఆధునిక సదుపాయాలతో ఐటీ పార్కు ఏర్పాటు కావాలని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మోడళ్లను పరిశీలించి ఆమేరకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సీఎం ఆదేశం.

## సబ్‌ప్లాన్ అంటే లోకేష్‌కు తెలుసా?: మంత్రి మేరుగ నాగార్జున

విజయవాడ: దళితుల గురించి మాట్లాడే అర్హత నారా లోకేష్‌కు లేదని మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. సబ్‌ప్లాన్ అంటే లోకేష్‌కు అసలు తెలుసాఅని ప్రశ్నించారు. పాదయాత్రలో జనం లేక లోకేష్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. దళితులను మోసం చేసిన చరిత్ర.. దళితుల నిధులను పక్కదారి పట్టించిన ఘనత చంద్రబాబుదేననని మండిపడ్డారు.చంద్రబాబు నాయుడు సబ్ ప్లాన్‌ను నాశనం చేశాడని.. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు సబ్‌ప్లాన్‌ను అమలు చేశారని గుర్తు చేశారు. దళితుల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ కాంపోనెంట్ ప్లాన్ కింద నిధులు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఒక్క రూపాయి అవినీతి లేకుండా పరిపాలన అందిస్తున్నామన్నారు.'దళితుల మీద దాడి చేస్తే నీపైన ఏంటి.. మీ నాన్న పైన కూడా కేసు పెడతాం. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను పొలంబడి, రైతు క్షేత్రాలు, నేప్‌కీన్లు, పెళ్లి కానుక, ఎన్టీఆర్ సుజల స్రవంతికి ఖర్చు పెట్టామని చంద్రబాబు చూపించాడు. ఎస్సీ, ఎస్టీ, పేదలకు ఇంగ్లీష్ మీడియం విద్య, ఇళ్ల పట్టాలు రాకుండా అడ్డుకున్నది మీ బాబు, నువ్వు కాదా?. విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహం పెడుతుంటే టీడీపీ ఓర్వలేకపోతోంది. గతంలో ఎస్సీలకు రుణాలు పేరుతో అవినీతికి పాల్పడ్డారు. చంద్రబాబు హయాంలో దళితులపై జరిగిన దాడులపై చర్చించడానికి నేను సిద్ధం' అంటూ లోకేష్‌కు మంత్రి సవాల్ విసిరారు.

# వారి కోసం రూల్సే మార్చేశారు.. కేంద్రంపై రాహుల్ ఘాటు వ్యాఖ్యలు

దిల్లీ: అదానీ గ్రూప్ వ్యవహారం దేశాన్ని కుదిపేస్తున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్రంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.ప్రధాని మోదీతో ఉన్న సన్నిహిత సంబంధాల వల్లే గౌతమ్అదానీ అనతికాలంలో ప్రపంచ కుబేరుడిగా అవతరించారంటూ విమర్శించారు. అదానీ కోసం ఏకంగా నిబంధనలనే మార్చేశారని దుయ్యబట్టారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాహుల్ గాంధీ మంగళవారం మాట్లాడారు. ఈ సందర్భంగా గౌతమ్ అదానీ వ్యవహారంపై సుదీర్ఘంగా మాట్లాడారు."ఎయిర్‌పోర్టుల నిర్వహణలో పూర్వ అనుభవం లేనివారికి వాటి నిర్వహణ బాధ్యతలను అప్పగించకూడదని నిబంధనలు ఉన్నాయి. కానీ, ఆ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం మార్చివేసింది. ఏకంగా దేశంలోని ఆరు ఎయిర్‌పోర్టులను అదానీకి కట్టబెట్టింది. అత్యంత లాభదాయకమైన విమానాశ్రయాల్లో ఒకటైన ముంబయి ఎయిర్‌పోర్టును అదానీకి అప్పగించింది. ఇందుకోసం జీవీకే గ్రూప్‌పై సీబీఐ, ఈడీలను ప్రయోగించింది" అంటూ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ ఆరోపణలు చేశారు."2014లో 8 బిలియన్ డాలర్లుగా ఉన్న అదానీ సంపద 2022 నాటికి 140 బిలియన్ డాలర్లకు ఎలా పెరిగిందని యువత అడుగుతున్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా తమిళనాడు, కేరళ, హిమాచల్ ప్రదేశ్.. ఇలా పాదయాత్ర చేపట్టిన ప్రతి చోటా అదానీ పేరు వినిపించింది. ఆయన అడుగు పెట్టిన ప్రతి వ్యాపారంలోనూ ఎలా సక్సెస్ అవుతున్నారంటూ ప్రజలు ఆశ్చర్యపోతున్నారు" అని రాహుల్ ఎద్దేవాచేశారు."ప్రధాని మోదీ ఆస్ట్రేలియాకు వెళితే అదానీ గ్రూప్‌నకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 1 బిలియన్ డాలర్ల రుణం ఇచ్చింది. ప్రధాని బంగ్లాదేశ్ వెళితే అక్కడి పవర్ డెవలప్‌మెంట్ బోర్డు అదానీకి 25 ఏళ్ల కాంట్రాక్టు అప్పగించింది. ఇదేం మ్యాజిక్" అని రాహుల్ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఇప్పటి వరకు అదానీతో కలిసి ఎన్నిసార్లు విదేశాలకు వెళ్లారు? విదేశాల్లో ఎన్నిసార్లు అదానీని కలిశారు? భాజపాకు గడిచిన 20 ఏళ్లలో అదానీ ఎంతిచ్చారు? అంటూ రాహుల్ ప్రశ్నల వర్షం కురిపించారు. అగ్నిపథ్ స్కీమ్‌నూ ఈ సందర్భంగా తప్పుబట్టారు. ఆర్మీని ఈ పథకం బలహీన పరుస్తుందని సీనియర్ అధికారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారని రాహుల్ గాంధీ అన్నారు.లోక్‌సభలో రాహుల్ ప్రసంగం సమయంలో అధికార పక్షం నుంచి పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. నిరాధారమైన ఆరోపణలు చేయొద్దంటూ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు రాహుల్‌కు సూచించారు. ఆధారాలు ఉంటే చూపించాలన్నారు. తన



ప్రసంగం మధ్యలో అదానీతో మోదీ సంబంధాలకు సంబంధించి వారు ఇద్దరూ కలిసి ఉన్న చిత్రాలను లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రదర్శించారు. దీనిపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తంచేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే అంశంపై మాత్రమే మాట్లాడాలన్నారు.

# దుర్గగుడి ట్రస్ట్ బోర్డు రెడీ

విజయవాడ, ఫిబ్రవరి 7, బెజవాడ దుర్గమ్మ ఆలయానికి ట్రస్ట్ బోర్డ్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పదిహేను మంది కమిటి సభ్యులను నియమిస్తూ జీవోను జారీ చేసింది.బెజవాడ దుర్గమ్మ ఆలయానికి నూతన ట్రస్ట్ బోర్డ్ ను నియామకం జరిగింది. కమిటి నియమిస్తూ ప్రభుత్వం 111 జీవోను విడుదల చేసింది. బోర్డ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి రెండు సంవత్సరాలపాటు పదవిలో ఉంటారని జీవోలో ప్రభుత్వం పేర్కొంది. మొత్తం పదిహేను మంది సభ్యులతో దేవస్థానం ప్రధాన అర్చకుడిగా ఉన్న వ్యక్తి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా కూడా కమిటిలో ఉంటారని జీవోలో ప్రభుత్వం వెల్లడించింది. గత దసరా ఉత్సవాలకు ముందు ఇంద్రకీలాద్రి ట్రస్ట్ బోర్డ్ పదవి కాలం ముగిసింది. అయితే అప్పటి నుంచి నూతన కమిటి నియామకం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన ఆదేశాల మేరకు అధికార పార్టీకి చెందిన నాయకుల్లో ఉత్సాహం నెలకొంది.గతంలో ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్‌గా బీసీ వర్గానికి చెందిన పైలా సోమినాయుడును నియమించారు. ఇప్పుడు కూడా పూర్తిగా అధికార పార్టీకి చెందిన నాయకులు, వారి కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వటంతోపాటుగా, కులాల వారీగా సభ్యుల నియామకం జరిగిందనే ప్రచారం జరుగుతుంది. ఈసారి కూడా ఛైర్మన్ పదవిలో బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని నియమించారు. అంతేకాదు గతంలో పని చేసిన ఛైర్మన్ కూడా విజయవాడకు చెందిన వ్యక్తి కాగా ఇప్పుడు కూడా విజయవాడకు చెందిన వ్యక్తికే ఛైర్మన్ పదవిని కేటాయించారు. బీసీ వర్గానికి చెందిన కర్నాటి రాంబాబు ఛైర్మన్‌గా ప్రచారం జరుగతుంది. ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో మాత్రం రాంబాబును సభ్యుడిగానే ప్రభుత్వం పేర్కొంది. కమిటి ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఛైర్మన్‌ని ఎన్నుకొని అధికారికంగా ప్రకటిస్తారని చెబుతున్నారు. పదిహేను మంది గల కమిటిలో పూర్తి సామాజిక వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నియామకాలు జరిగినట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి.దేవాదాయ శాఖలో మాజీ మంత్రి వెలంపల్లి మార్క్ ఇప్పటికి కంటిన్యూ అవుతుందనే ప్రచారం జరుగుతుంది. తాజాగా విడుదలైన దుర్గగుడి పాలక మండలి జాబితా విషయంలో కూడా ఈ విషయం మరోసారి స్పష్టం అయ్యిందని పార్టీలో ప్రచారం జరుగుతుంది. వాస్తవానికి ప్రస్తుతం దేవదాయ శాఖ మంత్రిగా కొట్టు సత్యనారాయణ వ్యవహరిస్తున్నారు. అయితే దుర్గగుడి పాలక మండలి సభ్యుల నియామకంలో ప్రస్తుత మంత్రి జోక్యం లేకుండానే సభ్యుల నియామకం జరిగిందని కూడా చర్చ మొదలైంది. దుర్గగుడి ఛైర్మన్ పదవిని విజయవాడకు చెందిన వ్యక్తికి రెండోసారి ఇవ్వటం చర్చకు దారి తీసింది. అది కూడా పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వ్యక్తికే మరోసారి ఛైర్మన్ గిరిని అప్పగించటంపై పార్టీ నేతలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



ఈసారి ఛైర్మన్ పదవిని అమ్మవారి భక్తులు ఎక్కువగా వచ్చే ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన వ్యక్తిని ఎంపిక చేయాలని గతంలో కూడా చాలా డిమాండ్లు వచ్చాయి. అయినా మరోసారి కూడా విజయవాడకు చెందిన వ్యక్తికే ఛైర్మన్ పదవిని కేటాయిచటంపై పార్టీ నేతల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి

# జగన్ కు అప్పురత్న అవార్డు ఇవ్వాలి

విజయవాడ, ఫిబ్రవరి 7,వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం తొమ్మిది నెలల్లోనే ఆర్బీఐ నుంచి రూ. 55, 555 కోట్ల అప్పు తెచ్చిందని లెక్కలు విడుదల అయ్యాయి. దీనిపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ .. సీఎం జగన్ పై సెటైర్ వేశారు. ఆయనకు అప్పు రత్న అవార్డు వచ్చినట్లుగా అధికారులు ఆయనకు ఓ మెమెంటోను తెచ్చి ఇస్తున్నట్లుగా కర్టూన్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో షేర్ చేశారు. పక్కనున్న మరో అధికారి అది భారతరత్న లాంటి గొప్ప అవార్డు అని చెబుతూండటం మరింత సెటైరిక్‌గా ఉంది. ఈ కార్టూన్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ కార్టూన్ ను సోషల్ మీడియాలో



పంచుకుంటూ పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మీ వ్యక్తిగత ఆస్తులను పెంచుకునే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. అదే సమయంలో రాష్ట్ర, ప్రజల ఆస్తులను కుక్కలకు వదిలేయాలని .. కానీ వ్యక్తిగత ఆస్తులను భద్రంగా చూసుకుంటారన్నారు. అదే అది సీఎం స్పిరిట్ అని.. సెటైర్ వేసారు. జనసేనానికి చాలా కాలంగా.. సీఎం జగన్ పై ఈ తరహా సెటైర్లు కార్టూన్ల రూపంలో వేస్తున్నారు. ఓ కేబినెట్ మీటింగ్‌లో ఎన్నికలు వస్తున్నందున మంత్రులందరూ అవినీతికి దూరంగా ఉండాలని జగన్ సూచించినట్లుగా వార్తలు వచ్చాయి.దానిపై కార్టూన్ పోస్ చేసి.. అవినీతికి క్రాప్ హాలీడ్ ప్రకటించడం సంతోషమని సెటైర్ వేసారు. పవన్ కల్యాణ్ సోషల్ మీడియాలో స్పందించేది తక్కువే. ఎక్కువ సందర్భాల్లో పార్టీకి సంబంధించిన సమాచారాన్ని ఇస్తారు. కీలకమైన అంశాలపై విమర్శలు చేయాలంటే ..తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసారు. పవన్ కల్యాణ్ సోషల్ మీడియాలో ఏ అప్ డేట్ ఇచ్చినప్పటికీ.. సంచలనంగా మారుతూ ఉంటుంది. వైరల్ అవుతుంది. ఇలాంటి సెటైరిక్ కౌంటర్లు ఇచ్చినప్పుడు జనసైనికులు మరింతగా ఉత్సాహంగా వాటిని వైరల్ చేస్తూ ఉంటారు. ఏపీ ప్రభుత్వ అప్పుల వ్యవహారం ప్రతీ సారి హైలెట్ అవుతూనే ఉంటుంది. పూర్తిగా అప్పుల వివరాలు ఆర్బీఐకికూడా చెప్పడంలేదని.. ఆర్బీఐ దగ్గర తీసుకున్న బహిరంగ మార్కెట్ రుణాల గురించి మాత్రమే... బయట పెడుతూంటారని చెబుతూంటారు. ఇటీవలి కాలంలో ఉద్యోగులకు పూర్తి స్తాయిలో జీతాలు కూడా సమయానికి అందడంలేదు. అప్పులు దొరకకపోవడం వల్లనే ఈ సమస్య వచ్చిందని చెబుతున్నారు. ఇలాంటి సమయంలో పవన్ కల్యాణ్ అప్పులపై వేసిన సెటైర్లు నెటిజన్లను మరింత గా ఆకట్టుకుంటున్నాయి.



# ఛలో విశాఖ వడివడిగా ఏర్పాట్లు

విశాఖపట్టణం, ఫిబ్రవరి 7, విశాఖ రాజధాని కాబోతోందన్నా సీఎం జగన్ ఢిల్లీ కామెంట్ల తర్వాత విశాఖలో హంగామా మొదలైంది. రాబోయే రోజుల్లో విశాఖపట్నం రాజధాని కాబోతుంది.. త్వరలో నేను కూడా విశాఖపట్నం షిఫ్ట్ అవుతున్నా అని దేశరాజధాని సాక్షిగా ప్రకటించేశారు సీఎం జగన్. ఆంధ్రప్రదేశ్ పరిపాలన త్వరలో విశాఖపట్టణం నుంచి సాగనుంది. ఈ మేరకు ప్రభుత్వ యంత్రాంగం చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. ఈ విషయమై అధికార యంత్రాంగం నుంచి అధికారికంగా ఎలాంటి సమాచారం లేనప్పటికీ మౌఖికంగా మాత్రం ఆదేశాలు అందినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండేందుకు బీచ్ రోడ్డులో అనువైన ఇంటి కోసం అధికారులు అన్వేషిస్తున్నారు.వీఎంఆర్‌డీఏ అధికారులు ఇటీవల ఎంవీపీ న్యాయ విద్యా పరిషత్ పక్క నుంచి రహదారి విస్తరణ పనులు చేపట్టడాన్ని బట్టి చూస్తే సీఎం నివాసం ఈ దారిలోనే ఉండే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు, మంత్రులు కూడా తమకు అనుకూలమైన ఇళ్ల కోసం గాలిస్తున్నారు. మూడు రాజధానుల ముచ్చట ఒక కొలిక్కి రాలేదు. సుప్రీంకోర్టులో విచారణ త్వరలో జరగనుంది. పరిపాలనా కార్యాలయాల తరలింపు ఎప్పటికి జరిగినా.. అక్కడ తన క్యాంపు కార్యాలయాన్నైనా ఏర్పాటు చేసుకోవాలని సీఎం జగన్ యోచిస్తున్నట్లు సమాచారం.మూడు రాజధానుల విషయంలో ఏదో ఒకటి చేశామనిపించుకోవాలని భావిస్తున్నారు. మార్చి మూడోవారంలోనే విశాఖలో సీఎం క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేసుకునే అవకాశముందని తెలుస్తోంది. ఢిల్లీ పర్యటనకు ముందే విశాఖకు తాను రాబోతున్నట్టు, క్యాంప్ కార్యాలయం చూడండని జగన్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో జిల్లా యంత్రాంగం అత్యంత గోప్యంగా సీఎం క్యాంప్ ఆఫీసుకోసం భవనాల అన్వేషణ జరుపుతోంది.దీనిని రుషికొండపైన నిర్మిస్తున్న పర్యాటకశాఖ ప్రాజెక్టు భవనాల్లో ఏర్పాటు చేయాలని తొలుత భావించారు. కానీ? వచ్చే నెల మూడో వారానికి రుషికొండపై నిర్మాణాలు పూర్తికావని అధికారులు అంటున్నారు. తాత్కాలికంగా రుషికొండ, ఐటీ హిల్స్, మధురవాడ, కొమ్మాది ప్రాంతాల్లో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం కోసం నాలుగైదు భవనాలను పరిశీలించారు. బీచ్ రోడ్డులోని కొన్ని భవనాలతోపాటు? ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉప కులపతి, రిజిస్ట్రార్ బంగ్లాలను కూడా పరిశీలించారు. ఈ అన్వేషణ మొత్తం గోప్యంగానే సాగుతోంది. త్వరలో ఈ అన్వేషణ పూర్తవుతుందని, జగన్ కు ఒక క్యాంప్ కార్యాలయం ఫైనలైజ్ అవుతుందని అంటున్నారు.

# సంపాదకీయం

బుధవారం 08-02-2023

## ఉచితాలపైనే ఇంకా 70 శాతం...

భారత్ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ దేశాల్లో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నది. ముఖ్యంగా వ్యవసాయ రంగం గణనీయమైన అభివృద్ధిని సాధించింది. ప్రపంచ దేశాల్లో వరి, గోధుమ, చక్కెర, వేరుశనగ, కాటన్, పండ్లు, కూరగాయల ఉత్పత్తులలో రెండవ అతిపెద్ద ఉత్పత్తిదారుగా ఉన్నది. పాలు, పప్పు ధాన్యాలు, జూట్ ఉత్పత్తులలో ప్రథమ స్థానంలో ఉన్నది. చక్కెర ఉత్పత్తుల్లో ఒకటవ స్థానంలోనూ, సౌర విద్యుత్ ఉత్పత్తిలో రెండవ స్థానంలోనూ, విద్యుత్ ఉత్పత్తిలో మూడవ స్థానంలోనూ, వస్త్రాల ఉత్పత్తిలో రెండవ స్థానంలోనూ, మొబైల్ పరికరాలు ఉత్పత్తిలో రెండవ స్థానంలోనూ , ఉక్కు ఉత్పత్తిలో రెండవ స్థానంలోనూ ఇలా అనేక రంగాలలో ఉత్పత్తులు గణనీయంగా పెంచుకోగలిగాము. ఒకవైపు భారత్ మెరిసిపోతున్నదని చెబుతున్నారు. మరొకవైపు రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఉచితాలు వందల్లో ఉంటే , ప్రధానమంత్రి పేరుతో 20కి పైగా ఉచితాలు (ఫ్రీ బీస్) అమలవుతున్నాయి. వీటిద్వారా మన దేశంలో 80 కోట్లకు పైగా ప్రజలు జీవనం సాగిస్తున్నారంటే ఈ దుస్థితి ఎందుకు ఉందో పాలకులకు తెలియాలి. 1947లో దేశ తలసరి ఆదాయం 250 రూపాయలు మాత్రమే కాగా అది నేడు 1 లక్షా 50 వేల రూపాయలుగా ఉన్నది. జాతీయ ఆదాయం పెరిగినందువలన తలసరి ఆదాయం కూడా పెరిగినట్లుగా లెక్కలు ఉంటాయి. కానీ ఆ ఆదాయం పొందని 80 కోట్లకు పైగా పేదలు ఉచితాలవైపు ఎగబడుతున్నారు. దీనికంతా కారణం నిరుద్యోగం, పేదరికం, ఆదాయ అసమానతలు, శ్రమసాంద్రతా ఉత్పత్తి పద్ధతులను ఎంపిక చేసుకోకపోవడమే కదా. దీనిని పాలకులు ఇకనైనా గమనించాలి.ప్రపంచ దేశాల ఆకలిని తీర్చుతున్న రైతులుగా భారత రైతులు పేరు తెచ్చుకున్నారు. 1950-51 లో 50 మిలియన్ టన్నులు మాత్రమే వ్యవసాయ ఉత్పత్తులు ఉండగా నేడు 317 మిలియన్ టన్నులకు వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయి. 1950లో మన దేశ జనాభా 35 కోట్లు కాగా నేడు 140 కోట్లకు పెరిగింది . ఆనాడు షిప్ టు మౌత్ అంటే ఓడల నుంచి ఆహార ధాన్యాలు వస్తేనే ఇక్కడ మనము వంట చేసుకునే వాళ్ళం. నేడు విదేశాలకు మన ఆహార ధాన్యాలు ఓడల నిండా ఎగుమతి చేసే స్థాయికి ఎదిగాం. అన్నదాతను ఆదుకుంటే దేశ పురోగతి అధికమవుతుంది. జీవన సౌందర్యం ఆహార సంపూర్ణతతోనే ఉంటుంది. అయితే మన రైతు నేడు సంతోషంగా లేదు. అప్పుల బాధలకు తోడు, పండించిన పంటకు మద్దతు ధర లేక రైతులు అల్లాడిపోతున్నారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వాలు సమకూర్చే వనరులకు సమానంగా రైతులకు కూడా అందించగలిగితే మన దేశాభివృద్ధి ప్రపంచంలో మకుటాయమానంగా ఉంటుంది తొలి రోజుల్లో ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించి తద్వారా ఉత్పత్తులను, ఉద్యోగాల కల్పనను పెంచాలనే లక్ష్యంతో మన పాలకులు సఫలీకృతమయ్యారని చెప్పవచ్చు. కానీ నేడు అదే సంస్థలను అమ్మేస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వం అమ్మేయడాన్ని పెట్టుబడుల ఉపసంహరణ అంటాం. ప్రస్తుతం మన దేశంలో రిజిస్టర్ అయిన విదేశీ కంపెనీలలో 5,068 సంస్థలు వివిధ వ్యాపారాలు చేస్తున్నాయి. అయినప్పటికీ వారి దప్పిక తీరలేదు అన్నట్లుగా ప్రైవేటీకరణ ప్రక్రియ ఇప్పుడు పతాక స్థాయికి చేరుకున్నది. 2017-18 వరకు 3 లక్షల 47 వేల 439 కోట్ల రూపాయలకు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేశారు. ఈ పరిస్థితుల్లో ఉద్యోగ కల్పన వీలు కాదు. అశేష ప్రజానీకం నిరుద్యోగంతో కనీస సౌకర్యాలు పొందలేకపోతున్నారు. దేశంలో 42.5% సంపద ఒకే ఒక్క శాతం జనాభా దగ్గర ఉన్నది. 1980 నుంచి ఉన్నత ఆదాయ వర్గాలకు చెందిన ఒక్క శాతం జనాభా వాటా మన జాతీయ ఆదాయంలో 150 శాతం పెరిగింది. నూరు మంది సంపన్నుల దగ్గర 54 లక్షల కోట్ల రూపాయలు ఉన్నది. ఇది మన దేశ బడ్జెట్ కన్నా ఎక్కువ. 50 శాతం జనాభా దగ్గర 2.8 శాతం సంపద మిగిలి ఉంది.సమానత్వం, సోదరభావం లేకుండా ఆర్థిక సామాజిక అసమానతలు దీర్ఘకాలం కొనసాగితే ఆదేశ రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదమని 1949 లోనే భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ హెచ్చరించారు. ఆయన సామాజిక అంశాలకు ఎంత ప్రాధాన్యత ఇచ్చారో, ఆర్థిక అంశాలకు కూడా అంతే ప్రాధాన్యత ఇచ్చి సమసమాజాన్ని కాంక్షించినారు. అట్టడుగు వర్గాల వారికి రాజకీయ అధికారం కూడా ఉండాలని భావించారు. ఉత్పత్తి ఉద్యోగిత ఆదాయాలు రాజ్యం పర్యవేక్షణలో జరిగితేనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా వస్తు ఉత్పత్తి ఎలా చేస్తారు, దానిని ఎలా పంచుకుంటారు అనే దానికి అనుగుణంగా సాంఘిక నిర్మాణం, రాజకీయ కార్యాచరణ రూపకల్పన ఉంటే అప్పుడే సంక్షేమ రాజ్యాన్ని స్థాపించవచ్చునని చెప్పారు. అలాగే రాజకీయంగా సంపూర్ణ స్వరాజ్యం అంటే అందరికీ స్వాతంత్ర ఫలాలు లభించడమేనని జాతిపిత మహాత్మా గాంధీ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో తరచూ అనేవారు. భారీ ఉత్పత్తులు కాదు... భారీ సంఖ్యలో ప్రజల చేత ఉత్పత్తులు జరగాలని అనేవారు. అంటే 'మాస్ ప్రొడక్షన్' కాదు 'ప్రొడక్షన్ బై మాసెస్' అనేవారు. ఆర్థిక వ్యవస్థ సైజు ముఖ్యం కాదు షేపు ముఖ్యం అని దీనర్థం. అప్పుడే దేశం ప్రపంచంలో అగ్రగామిగా ఉంటుంది. కానీ మన జాతి నిర్మాతలు చేసిన ఈ ప్రబోధం కాలక్రమంలో గాలికెగిరిపోయిందని చెప్పాలి.

## సామినేనికి సొంత నేతలే.. పొగబెడుతున్నారా

విజయవాడ, ఫిబ్రవరి 7, సీపీకి కంచుకోటగా ఉన్న జగ్గయ్యపేట నియోజకవర్గంలో అలజడి మెదలవుతోంది. సొంత పార్టీకి చెందిన నేతల నుంచే ఎమ్మెల్యేపై వ్యతిరేకత వ్యక్తం కావడంతో రాబోయే ఎన్నికల్లో పరిస్థితి ఎలా ఉంటుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. సొంత పార్టీ ఎమ్మెల్యే పైనే జిల్లాలోని నాయకులు విమర్శనాస్త్రాలను ఎక్కుపెట్టడం కొందరు నేతల్ని కలవరపెడుతోంది. జగయ్యపేట నియోజకవర్గంలో స్థానిక వైసీపీ శాసనసభ్యుడిగా ఉన్న ఉదయ భానుకు ప్రస్తుతం సొంత పార్టీ నేతల నుంచి సవాల్ ఎదురవుతోంది. స్థానికంగా పట్టు ఉన్న ఉదయభాను మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నియోజకవర్గంపై పూర్తి స్థాయిలో పట్టు ఉంది. ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల్లో సైతం స్థానికంగా ఉదయభానుకు ఫాలోయింగ్ ఉంది. నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో వైసీపీని బలోపేతం చేయటంతోపాటుగా, పార్టీ నిర్మించిన నాటి నుంచి ఆయన జెండా మోసారు. దీంతో జగన్ వద్ద సామినేని ఉదయభానుకు మంచి వెయిటేజీ ఉంది. పొలిటికల్ గా నియోజకవర్గంలో సామినేనికి మంచిపట్టు ఉండటంతో పాటుగా ప్రస్తుతం అధికారంలో ఉండటంతో ఆయన జోరు కొనసాగుతోంది.నియోజవకర్గంలో సామినేని ఉదయభానుకు పార్టీ పరంగా ఎటువంటి గ్రూపులు లేవు. అదే సమయంలో ఉదయభానుకు పోటీగా మరో నేత పార్టీలో లేకపోవటంతో ఆయనే పెద్ద దిక్కుగా ఉంటున్నారు. అయితే జిల్లా స్థాయిలో సొంత పార్టీకి చెందిన నేతలే సామినేని ఉదయభానును టార్గెట్ చేశారనే ప్రచారం జరుగుతోంది. ఇందుకు ఇటీవల జరిగిన పరిణామాలు ఓ కారణంగా కనిపిస్తున్నాయని టాక్ నడుస్తోంది.మంత్రి పదవి విషయంలో సామినేని ఉదయభాను తీవ్ర నిరాశకు గరయ్యారు. తనకు మంత్రి పదవి రాకపోవటంతో సామినేని చాలా రోజుల వరకు ఇంటి నుంచి బయటకు రాలేదు. చివరకు సీఎం జగన్ జోక్యం చేసుకొని స్వయంగా మాట్లాడి ఉదయభానుకు నచ్చచెప్పారు. అయితే ఇదే సమయంలో తనకు మంత్రి పదవి రాకపోవటం వెనుక జిల్లాకు చెందిన నాయకుల ప్రమేయం ఉందని, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ తో పాటుగా మరికొందరు నేతలపై సామినేని ఉదయభాను విమర్శలు చేశారు. ఈ వ్యవహారం పార్టిలో అలజడి రేపింది. ఇక తాజగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన విజయవాడ నగర అధ్యక్షుడు బొప్పన భువకుమార్ జన్మదిన వేడుకల్లో ఉదయ భానుతో జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న వెలంపల్లి శ్రీనివాసరావు వాగ్వివాదానికి దిగారు. ఈ సంఘటన సైతం సొంత పార్టీలో అలజడి రేపింది. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి, తన సొంత పార్టీకి చెందిన శాసన సభ్యుడితో బాహాటంగా కార్యకర్తలు అందరూ చూస్తుండగానే విమర్శలు చేయటం, వాగ్వివాదానికి దిగటం కలకలం రేపింది. దీంతో మరోసారి సామినేని ఉదయభానుకు సొంత పార్టీ నేతలతో ఉన్నవిభేదాలు బహిర్గం అయ్యాయి.ఇక జగ్గయ్యపేట టీడీపీలో సీటు కోసం రెండు వర్గాలు పోటీ పడుతున్నాయి. ఇప్పటికే ఇంఛార్జ్ గా ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్యను అధిష్టానం ప్రకటించింది. అయితే నియోజకవర్గంలో ఆర్యవైశ్యుల కన్నా కమ్మ సామాజిక వర్గం ఎక్కువగా ఉండటంతో తమకు సీటు ఇవ్వాలని ఆ వర్గం ప్రయత్నిస్తుంది. ఇప్పటికే మాజీ మంత్రి నెట్టం రఘురామ్, పార్టీలో యాక్టివ్ అయ్యారు. అయితే ఆయన ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. దీంతో వైసీపీకి పూర్తి అవకాశాలు ఉన్నా, పార్టీ జిల్లా నేతలతో ఉదయ భానుకు ఉన్న విభేదాలతో రానున్న ఎన్నికల్లో ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

## యనమల కృష్ణుడు ఆశా నిరాశానే



కాకినాడ, ఫిబ్రవరి 7, సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అంటే టీడీపీ అధినేత చంద్రబాబుకు గౌరవం. ఆయన సలహాలు, సూచనలు కూడా పార్టీకి అవసరం అని భావిస్తారు. పార్టీ క్లిష్టంగా ఉన్న సమయాల్లో యనమల రామకృష్ణుడు చేసిన సాయాన్ని చంద్రబాబు ఎప్పటికీ మరిచిపోలేరు. అందుకే ఆయనకు అధికారంలో ఉంటే ఖచ్చితంగా మంత్రిపదవి లభిస్తుంది. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకపోయినా శాసనమండలికి పంపి చంద్రబాబు ఆయనకు గౌరవిస్తారు. యనమల సలహాలు తనకు భవిష్యత్ లోనూ ఎంతో అవసరమవుతాయని చంద్రబాబు ఆయనను దూరం చేసుకోరు నిజానికి లోకేష్ పార్టీలో యాక్టివ్ కాకముందు యనమల రామకృష్ణుడు నెంబర్ 2గా ఉండేవారు. లోకేష్ ఎంట్రీ తర్వాత కీలక నిర్ణయాల్లో తన ప్రమేయం పెద్దగా లేకపోయినా తూర్పు గోదావరి జిల్లా రాజకీయాల్లో మాత్రం ఆయనదే పై చేయి అని చెప్పక తప్పదు. తూర్పు గోదావరి జిల్లాతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో పొత్తులు వంటి నిర్ణయాలపై కూడా యనమల సలహాలు చంద్రబాబు తప్పకుండా తీసుకుంటారు. యనమలకు భవిష్యత్ రాజకీయాలను అంచనా వేసే శక్తి ఉందని చంద్రబాబు నమ్ముతారు. అందుకే యనమలకు ఎవరు అవునన్నా కాదన్నా చంద్రబాబు వద్ద మాత్రం గౌరవం ఏమాత్రం తగ్గదు గత కొద్ది రోజులుగా తుని నియోజకవర్గం టీడీపీలో విభేదాలు తలెత్తాయి. యనమల రామకృష్ణుడు ఆయన సోదరుడు కృష్ణుడు మధ్య కొంత గ్యాప్ వచ్చింది. యనమల తన కుమార్తెను దివ్యను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయించాలని భావిస్తున్నారు. ఇటీవల తుని కార్యకర్తల సమావేశంలో చూచాయగా చెప్పారు. కానీ ఆయన సోదరుడు మాత్రం అందుకు అంగీకరించడం లేదు. తానే మరోసారి పోటీ చేస్తానని చెబుతున్నారు. యనమల కృష్ణుడు ముఖ్య నేతలతో మాట్లాడిన ఆడియో కూడా వైరల్ అయింది.అయితే చివరకు యనమల రామకృష్ణుడు మాటే నెగ్గింది. యనమల దివ్యను తుని ఇన్‌చార్జిగా నియమిస్తూ టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. అంటే యనమల కృష్ణుడుకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ లేనట్లేనని చెప్పారు. కృష్ణుడు పట్టుబట్టినా, సోదరుడు వత్తిడి తెచ్చినా తన కుమార్తె రాజకీయ భవిష్యత్ కోసం యనమల దివ్య కు ఇన్‌ఛార్జి పదవి ఇప్పించుకున్నారంటారు. చంద్రబాబు కూడా యనమలను కాదనలేకపోయారు. యనమల కృష్ణుడు తుని నుంచి రెండుసార్లు వరసగా ఓటమిపాలయ్యారు. మరి ఈసారి టిక్కెట్ ఇవ్వకుంటే ఆయన ఏం చేస్తారన్నది ఇంకా తెలియరాలేదు. ఆయనను శాసనమండలి, రాజ్యసభకు పంపిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చే అవకాశముంది. మొత్తం మీద యనమల సోదరుడు పంతం పట్టినా తన మాటనే నెగ్గించుకోవడం తునిలో హాట్ టాపిక్ గా మారింది.

## కమలానికి... సేనానికి దూరం పెరుగుతోందా...

విజయవాడ, ఫిబ్రవరి 7, ఇదీ ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు లేటెస్ట్ స్టేట్మెంట్. ఇప్పటి వరకు జనసేనతోనే ఉన్నాం? జనసేనతోనే ఉంటాం.. జనసేనా కూడా మాతోనే ఉంటుందన్న సోము మాట మారిపోతోంది. ఒక రోజు కాదు? ఒకసారి కాదు? రోజూ అదే మాట.. అదే తీరు. జనసేనాని ఏమన్నా?. ఏం చెప్పినా?. చివరికి మాతోనే ఉంటారనే ధీమాతో ఉండేది ఏపీ బీజేపీ. అంతేకాదు నేతల మాటల్లో కూడా అది స్పష్టంగా కనిపించేది. కానీ ఓటు చీలనివ్వనని కంకణం కట్టుకున్న పవన్ తీరు చూస్తున్న బీజేపీకి వాస్తవం బోధపడుతున్నట్టుంది. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు? శాశ్వత మిత్రులు ఉండరని బీజేపీ ఆలస్యంగా గుర్తించినట్టుంది. పవన్ ప్రయాణం టీడీపీ వైపు వెళ్తున్నట్టు గ్రహించింది. ఏం చెప్పినా? ఏం చేసినా? పవన్ ఆగేలా లేరని గ్రహించినట్టుంది. అందుకే బాణీ మార్చింది. మా పొత్తు జనంతో?. కుదిరితే జనసేనతో అంటూ కొత్త పల్లవి ఎత్తుకుంది. అంతేనా? కుదిరితే జనసేనతో అంటున్న తమ మాటల వెనుక చాలా పెద్ద అర్థం ఉందంటూ తమ మనసులోని భావాన్ని అర్థం చేసుకోడంటూ క్లూ కూడా ఇచ్చారు సోము వీర్రాజు.భీమవరంలో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లోనే ఒంటరిపోరుపై బీజేపీ అధిష్టానం సంకేతాలు ఇచ్చింది. పవన్ మీద నమ్మకం పెట్టుకుని కూర్చోకుండా సొంతంగా నెగ్గడం ఎలాగో చూసుకోండి అంటూ తేల్చి చెప్పింది. అయినా సరే ఇంకా పార్టీలో జనసేనతో పొత్తు ఉంటుందనే నమ్మకం పోలేదు. చివరికి కలిసే పోటీ చేస్తాం అని అనుకునే వాళ్లు కమలం పార్టీ నిండా చాలా మందే ఉన్నారట. ఇది అసలుకే ఎసరు తెచ్చేలా ఉందని ఆందోళనలో పడ్డారట అధ్యక్షుడు. అందుకే క్రమక్రమంగా అసలు విషయం అర్థమయ్యేలా కేడర్ కు చెప్తున్నారట. ఉత్తరాంధ్ర పర్యటనలో ఉన్న సోము వీర్రాజు అడిగిన వాళ్లకు.. అడగని వాళ్లకు ఇదే విషయం చెప్పేస్తున్నారట. పవన్ ను? ఆయన పార్టీతో పొత్తును నమ్ముకుంటే నిండా మునిగిపోతామనే భయంతో బీజేపీ వ్యూహం ఛేంజ్ చేస్తోందట. చివరి వరకు జనసేనను పట్టుకుని వేలాడి? చివరకు ఆ పార్టీ తమను వదిలేస్తే పరువు పోతుందని అనుకుంటోందట. అందుకే ఇప్పటి నుంచే స్లో పాయిజన్ లాగా కుదిరితేనే అంటూ షరతు పెడుతోందట. పొత్తు కుదిరితే ఓకే? కుదరకుంటే? మేం అప్పుడే చెప్పాం కదా? అని తప్పించుకోడానికి వీలుగానే ఈ డైలాగ్ ను సోము వీర్రాజు వాడేస్తున్నారట.

## తెలుగు తమ్ముళ్లు మౌనం ఎందుకు..

నెల్లూరు, ఫిబ్రవరి 7, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో టీడీపీ టికెట్‌పై పోటీ చేస్తానని అనుచరులకు చెప్పేశారు. ఆయన అలా అన్నారో లేదో అధికారపార్టీ వైసీపీ ఆయన అధికారాలను కత్తెరించి.. రూరల్ ఇంఛార్జ్‌గా ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేరును ప్రకటించింది. ఈ మొత్తం ఎపిసోడ్‌లో స్పందించంది నెల్లూరు జిల్లా టీడీపీ నేతలే. అలాగే కోటంరెడ్డిని ఆహ్వానిస్తూ టీడీపీ పెద్దల నుంచి ఎలాంటి ప్రకటన లేకపోవడంతో ఎమ్మెల్యే శిబిరంలోనూ ఆందోళన కనిపిస్తోందట. నెల్లూరు జిల్లా టీడీపీలో సీనియర్లుగా ఉన్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్రతోపాటు నెల్లూరు రూరల్ టీడీపీ ఇంఛార్జ్ అబ్దుల్ అజీజ్‌లు కోటంరెడ్డి వ్యవహారాన్ని చర్చిస్తున్నారట. ఇక్కడో విచిత్రం ఉంది. నిన్న మొన్నటి వరకు ఎమ్మెల్యే కోటంరెడ్డిపై ఈ టీడీపీ నేతలంతా ఒంటికాలిపై లేచేవారు. ఇప్పుడు మాత్రం ఆ ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్నట్టుకానీ.. వ్యతిరేకిస్తున్నట్టు కానీ ఎలాంటి స్పందన వీళ్ల నుంచి లేదు. కాకపోతే కోటంరెడ్డి వస్తే టీడీపీకి కలిగే లాభనష్టాలను విశ్లేషిస్తున్నారట టీడీపీ నాయకులు.సాధారణంగా వైసీపీ నాయకులు వస్తానంటే ప్రతిపక్ష నేతలు స్వాగతించడం పరిపాటి. కానీ కోటంరెడ్డి విషయంలో అలాంటి రియాక్షన్ ఏదీ లేదు. పైగా నెల్లూరు రూరల్‌లో టీడీపీ టికెట్‌పై పోటీ చేసేది తానేనని కోటంరెడ్డే ప్రకటించేసుకున్నారు. ఈ విషయంలో లోకల్ టీడీపీ కేడర్ వాదన మరోలా ఉంది. టికెట్ విషయంలో తమతో మాట్లాడకుండా టీడీపీ అధినేత నిర్ణయం తీసుకోబోరని వారు చెబుతున్నారు. అంతేకాదు.. ఎమ్మెల్యే విషయాన్ని తమతో ఇంతవరకు పార్టీ చీఫ్ మాట్లాడలేదని టీడీపీ సీనియర్లు అంతరంగిక సంభాషణల్లో కామెంట్స్ చేస్తున్నారట. వైసీపీలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి టీడీపీ నేతలపై దాడులు చేయించారని.. అలాంటి వ్యక్తికి ఎందుకు ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థం కావడం లేదనేది మరికొందరి వాదన. గత అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థిగా అబ్దుల్ అజీజ్ పోటీ చేశారు. ఆయనే ఇంఛార్జ్‌గా ఉండటంతో.. ఎమ్మెల్యే కోటంరెడ్డిని తీసుకునే పక్షంలో ముందుగా అజీజ్‌తో మాట్లాడతారు కదా అని కొందరి ప్రశ్న. అజీజ్‌కు ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతే టీడీపీ అధినేత ఓ నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారట.ఇదే సమయంలో మరో చర్చా జరుగుతోంది. తన అనుచరులకు భరోసా ఇచ్చేందుకే ఎమ్మెల్యే కోటంరెడ్డి తాను టీడీపీ నుంచి పోటీ చేస్తానని చెప్పి ఉండొచ్చంటున్నారు. అంతే తప్ప టీడీపీ అధినేత నుంచి ఆయనకు స్పష్టమైన హామీ రాలేదని వారి అభిప్రాయం. ఈ విషయంలో ఎవరి వాదన ఎలా ఉన్నా.. మాజీ మంత్రి సోమిరెడ్డి లాంటి వాళ్లు కూడా ఎమ్మెల్యే విషయంలో పెదవి విప్పకపోవడం తెలుగు తమ్ముళ్లను ఆశ్చర్య పరుస్తోంది.

## ఎలుకల కోసం ప్రత్యేకంగా ఉద్యోగులు

గుంటూరు, ఫిబ్రవరి 7, సాధారణంగా ఆస్పత్రిలో సిబ్బందిగా ఎవరుంటారు ? ముందుగా డాక్టర్లు.. తర్వాత నర్సులు.. సపోర్టింగ్ స్టాఫ్.. అటెండర్లు, ఆయాలు..ఇలా చాలా మంది ఉంటారు. కానీ ఎలుకల్ని పట్టడానికి ప్రత్యేకంగా ఉద్యోగులుంటారా ?. ఇదేందయ్యా.. ఎప్పుడూ వినలేదే అనుకుటారేమో.. ఉంటారు. ఇది నిజం. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్నారు.. అదే సాక్ష్యం. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో ఎటు చూసినా ఎలుకలు కనిపిస్తూ ఉంటాయి. అవే ఎలుకలు పేషెంట్ల ప్రాణాలకు ముప్పుగా మారటంతో అధికారులు వాటిని పట్టుకునేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు...గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో ఎలుకలు వ్యవహారం అంటే ఆషామాషీ కాదు.గతంలో జరిగిన సంఘటనలతో అధికారులు అప్రమత్తం అయ్యి,ఎలుకలను పట్టుకునేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు.దీంతో వారు ఎప్పటికప్పుడు ఎలుకలను పట్టుకుంటున్నారు. గతంలో ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న చిన్నారులను ఎలుకలు కొరికేయటంతో వారు అపస్మారక స్దితిలోకి వెళ్లారు.అందులో ఒకరు చనిపోవటంతో ఘటన అందరిని కలచి వేసింది.ఈ వ్యవహారం పై తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారాన్ని రాజేశాయి.దీంతో అప్పటి నుండి గుంటూరు ఆసుపత్రిలో ఎలుకలు అంటేనే అందరికి భయంపట్టుకుంటుంది.అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారం పై సీరియస్ గా వ్యవహరించారు.పెద్ద ఎత్తున జిల్లా యంత్రాంగాన్ని ప్రభుత్వాసుపత్రి లో విధులు నిర్వర్తించేలా ఆదేశాలు ఇచ్చారు.పెద్ద ఎత్తున పారిశుధ్య కార్మికులు ఇరవై నాలుగు గంటల పాటు నెల రోజులకు పైగా పని చేసి, ఆసుపత్రిలో చెత్తా చెదారాన్ని తొలగించారు. ఎలుకలు వచ్చే మార్గాలను పూర్తిగా గుర్తించి వాటిని తరిమికొట్టేందుకు అవసరం అయిన అన్ని చర్యలు తీసుకున్నారు.ఇందు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కూడా విడుదల చేసింది. నష్టనివారణా చర్యల్లో భాగంగా ఇప్పటికి గుంటూరు ఆసుపత్రిలో ఎలుకలను నివారించేందుకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపడుతూనే ఉంది.. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టీం లు ఇప్పటికి అలర్ట్ గా ఉంటూ ఎలుకలను పట్టుకోవటమే పనిగా విధులు నిర్వర్తిస్తున్నారు. నేటికి పదుల సంఖ్యలో ఎలుకలు గుంటూరు ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోన్ లలో చిక్కుకుంటున్నాయి.ఆసుపత్రికి పెద్ద ఎత్తున రోగులు,వారి బంధువులు వస్తుంటారు.అలా వచ్చిన వారు తినుబండారాలను కూడ తీసుకురావటం పరిపాటి..అయితే వాటిని ఎక్కడపడితే అక్కడ పడేయటంతో అవి ఎలుకలకు ఆహరంగా మారుతున్నాయి.ఒకే చోట ఆహారం పుష్కలంగా లభిస్తుండటంతో ఎలుకలు కూడ వందల సంఖ్యలో ఆసుపత్రిలో తిష్టవేశాయని అధికారులు భావిస్తున్నారు.5సంవత్సరాలుగా ఎలుకలు పై ప్రభుత్వ యంత్రాంగం నేటికి యుద్దం చేస్తూనేఉంది. ఆ ఎమ్మెల్యేకు సొంత పార్టీ నేతలే విలన్లుగా మారారా, అధిష్టానం ఎలా స్పందిస్తుందో !

## వారాహికి అడగడుగునా అడ్డంకులు



విజయవాడ, ఫిబ్రవరి 7, జనసేన అధినేత పవన్ కల్యాణ్ బస్సు యాత్ర చేస్తానని ప్రకటించారు. ఇందుకోసం వాహనాన్ని కూడా సిద్ధం చేసుకున్నారు. వారాహి అని వాహనానికి నామకరణం చేసి ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో పూజలు నిర్వహించారు. మరో వైపు వరస సినిమాలు చేస్తున్నారు. ఆయన బస్సు యాత్ర రాష్ట్రంలో ఎప్పుడు ప్రారంభమవుతుందన్న చర్చ పార్టీలో జరుగుతుంది. అభిమానులు కూడా పవన్ రాక కోసం ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. బస్సు రెడీగా ఉంది. రూట్ మ్యాప్ ఇంకా తయారు కాలేదు. ఆయన ఎప్పుడు బస్సు యాత్ర ప్రారంభం చేస్తారన్నది ఇంకా తేదీలు ప్రకటించలేదు.. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభించి చిత్తూరు జిల్లా పర్యటనను మరికొద్ది రోజుల్లోనే ముగించనున్నారు. అయితే పవన్ కల్యాణ్ మాత్రం ఇప్పటి వరకూ బస్సు యాత్రపై స్పష్టత ఇవ్వకపోవడంతో పార్టీ కార్యకర్తలు, ఆయన ఫ్యాన్స్ నిరాశలో ఉన్నారు. పవన్ కల్యాణ? మాత్రం వరసగా సినిమాలకు కొబ్బరి కాయలు కొట్టేస్తున్నారు. బస్సు యాత్ర ఒకసారి ప్రారంభమైతే ఇక ఆపేందుకు వీలులేదు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించాల్సి ఉంటుంది. బస్సు యాత్ర కావడంతో అన్ని నియోజకవర్గాల్లో టచ్ చేసే అవకాశముందని చెబుతున్నారు లేకపోతే కొన్ని ఎంచుకున్న నియోజకవర్గాలకే బస్సు యాత్రను పరిమితం చేయాలన్న ఉద్దేశ్యంలో కూడా జనసేనాని ఉన్నారు. ఎటూ పొత్తులుంటాయి కాబట్టి తమకు బలమున్న నియోజకవర్గాల్లోనే వారాహి వెళ్లేలా రూట్ మ్యాప్ ను రూపొందించాలని భావిస్తున్నారట. ప్రధానంగా ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో మాత్రం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో పర్యటించే వీలుందంటున్నారు. రాయలసీమలో మాత్రం ఎంపిక చేసిన నియోజకవర్గాలకే బస్సు యాత్రను పరిమితం చేస్తారని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం బట్టి తెలుస్తోంది.వ్యూహాన్ని తనకు వదిలేయమని చెబుతున్న పవన్ కల్యాణ్ ఎలాంటి స్ట్రాటజీతో వస్తారన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. బీజేపీ కూడా పవన్ వెళ్లిపోయినా సరే.. టీడీపీతో కలసి నడవకూడదని నిర్ణయించుకున్నట్లుంది. మానసికంగా కమలం పార్టీ నేతలు అందుకు సిద్ధమయ్యారు. పవన్ కూడా పొత్తులు ఇప్పుడే కాదని, ఎన్నికలకు వారం రోజులు ముందే మాట్లాడతానని చెబుతున్నారు. పవన్ అభిమానుల్లో మాత్రం ముఖ్యమంత్రి పదవి వస్తేనే టీడీపీతో పొత్తు కుదుర్చుకోవాలని కోరుకుంటున్నారు. లేకుంటే ఒంటరిగా పోటీ చేయడమే బెటర్ అని సూచిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో భవిష్యత్ టీడీపీ కంటే జనసేనకే ఉందని పవన్ అభిమానులు చెబుతున్నారు. అందువల్ల తొందరపడి పొత్తులపై ఒక నిర్ణయానికి రావద్దని కోరుకుంటున్నారు. మరి పవన్ కల్యాణ్ గేర్ మార్చేదెప్పుడో? అన్న ఆసక్తి సర్వత్రా నెలకొని ఉంది.

# అసమ్మతి నేతల వెనుక అదృశ్య హస్తం...

విజయవాడ, ఫిబ్రవరి 7,వైసీపీ అధినేత, సీఎం జగన్ వ్యవహార శైలితో ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మొన్నటి వరకు ఓ వెలుగు వెలిగిన శాసనసభ్యులు నేడు చేష్టలుడిగి ఉత్సవ విగ్రహాలుగా మారిపోతున్నారు. సహజంగా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాన్ని తమ అధికారానికి అడ్డాగా భావిస్తుంటారు. అక్కడ ఉండే కాంట్రాక్టర్లు, వ్యాపారులు ఇచ్చే చందాలతో ఎన్నికల్లో ఖర్చు పెడుతుంటారు. వివిధ సామాజిక వర్గాల పెద్దలను కనుసన్నల్లో ఉండేట్లు చేసుకుంటారు. ఆయా కులాల్లోని పేదలు తమకు ఏదైనా సంక్షేమ పథకం కావాలన్నా, కాస్త ఆర్థిక స్తోమతున్నోళ్లు పదవులు కావాలన్నా వైట్ అండ్?వైట్?డ్రస్‌లో మెరిసిపోయే పలుకుబడిదార్ల వద్దకు వెళ్లాల్సిందే. ఈ పెద్ద మనుషుల ద్వారా తమ రాజకీయ అధికారాన్ని ఎమ్మెల్యేలు సుస్థిరం చేసుకుంటుంటారు. ఈ వ్యవస్థను సీఎం జగన్?మూడున్నరేళ్లలో కూకటి వేళ్లతో పెకలించారు.సంక్షేమ పథకాల అమలులో ఎమ్మెల్యేల నెట్?వర్క్‌కు ఎక్కడా ప్రాతినిధ్యం కల్పించలేదు. కేవలం వాలంటీర్లు, సచివాలయాలు, కలెక్టర్లతో నడిపించారు. కాంట్రాక్టర్లు చేయడానికి పనుల్లేవు. ఒక వేళ పనులు ఇచ్చినా బిల్లులు రావని ఆసక్తి చూపడంలేదు. పథకాల అమలులో కుల సంఘాల నాయకులకు జోక్యం లేకుండా చేశారు. ఆయా కులాల కార్పొరేషన్లలో వాళ్లను చైర్మన్లు, డైరెక్టర్లుగా నియమించి సంక్షేమ పథకాల ప్రచారానికి పరిమితం చేశారు. దీంతో ఎమ్మెల్యేల ఆయుపట్టు మొత్తాన్ని పకడ్బందీగా నిర్వీర్యం చేశారు. చివరకు ఎమ్మెల్యేలు కూడా అనివార్యంగా భజన చెక్కలు తీసుకొని సీఎంకు భజన చేసేట్లు మల్చుకున్నారు. ఇక్కడే ఎమ్మెల్యేల అహం దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. రేపు సీటు ఇవ్వనంటే తమ గతేంటనే ఆలోచనలో పడ్డారు. ఇలాగే ఉపేక్షిస్తే చివరకు తమ నియోజకవర్గాల్లో పట్టు కోల్పోతామనే అభద్రతకు లోనయ్యారు. అందుకే ఎన్నికలు సమీపిస్తున్న వేళ ధిక్కార స్వరాలు వినిపిస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు అంటున్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మైక్రో లెవల్లో ఓట్లు వేయించే వర్గాలకే పరిమితం చేసినట్లు కనిపిస్తోంది. పంటలు సాగు చేసే రైతులకు రైతు భరోసా లబ్ధి నామమాత్రమే. కౌలుకు ఇచ్చే భూయజమానులకే ఎక్కువగా అందుతోంది. జగనన్న చేదోడు పథకం ఐదారు లక్షలు వెచ్చించి సెలూన్లు పెట్టుకున్న యజమానులకే వర్తిస్తుంది. అక్కడ కూలికి పనిచేసే క్షురకులకు అందదు. నెలకు ఐదు నుంచి పదివేలు అద్దెలు చెల్లించి పెట్టుకున్న ఇస్త్రీ షాపులు, డ్రై క్లీనింగ్?షాపు ఓనర్లకే జగనన్న తోడు అందుతోంది. రోడ్డుపై బండి మీద ఇస్త్రీ పెట్టె పెట్టుకున్నోళ్లకు ఇవ్వడం లేదు. నేతన్న నేస్తం పథకం రోజువారీ మజూరీ చేసుకునే పేద చేనేతలకు కాదు. వాళ్లకు పనులిచ్చే మాస్టర్?వీవర్లకు సాయం అందేట్లు నిబంధనలు రూపొందించారు. ఇలా చెప్పుకుంటూపోతే ప్రతి పథకంలోనూ ఆయా కులాల్లో ఆర్థిక స్తోమతు ఉండి పలుకుబడి కలిగిన వాళ్లకే సాయం అందేట్లు నిబంధనలు అమలు చేస్తున్నారు. వాళ్లే ఆయా కులాల్లోని పేదల ఓట్లు వేయించగలరనే ధీమా కావొచ్చు. దీని వల్ల నియోజకవర్గాల్లో పట్టు కోల్పోతున్నామనే ఆవేదన ఎమ్మెల్యేల్లో నెలకొంది.అసమ్మతి గళం వినిపించిన వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డికి బీజేపీ ఆహ్వానం పలికింది. అమిత్?షా ఈ మేరకు రాష్ట్ర బీజేపీ నేతలకు దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే సోము వీర్రాజు.. ఎమ్మెల్యే ఆనం రామ నారాయణ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించినట్లు సమాచారం. దీనికి తోడు నెల్లూరు రూరల్ వైసీపీ రెబల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్?రెడ్డి కూడా రాజకీయ ఓనమాలు దిద్దింది ఆరెస్సెస్?అనుబంధ ఏబీవీపీ విద్యార్థి సంఘంలోనే. ఓ వైపు వివేకా హత్య కేసులో సీబీఐ దూకుడు పెంచడం.. మరోవైపు పార్టీలో అసమ్మతి గళాలు ఎలుగెత్తడం వెనుక కేంద్ర పెద్దల హస్తం ఉందనే అనుమానాలు వైసీపీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి.

## ఆర్పిఐ నేత బోరుగడ్డ అనిల్ ఆఫీస్ కు నిప్పు.. అర్ధరాత్రి హైడ్రామా

గుంటూరు గుంటూరు జిల్లాలో అర్ధరాత్రి హై డ్రామా చోటుచేసుకుంది. బోరుగడ్డ అనిల్కుమార్ ఆఫీస్కు నిప్పు పెట్టారు. గుంటూరు డొంకరోడ్డులోని అనిల్ ఆఫీస్ను తగలబెట్టేశారు గుర్తుతెలియని వ్యక్తులు. అర్ధరాత్రి సమయంలో ఆఫీస్పై పెట్రోల్ పోసి నిప్పుపెట్టారు. ఇటీవల నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు బోరుగడ్డ అనిల్. అర్ధరాత్రి సమయంలో ఆఫీస్ లోకి చొరబడ్డ దుండగులు పెట్రోల్ చల్లారు. అనంతరం నిప్పు పెట్టి అక్కడినించి పారిపోయారు. ఫర్నిచర్ అగ్నికి ఆహుతి అయింది. అయితే, ఈఘటనపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరూ లేని సమయంలో వచ్చిన ఆరుగురు వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పటించి తనపై దాడి చేసినట్టు అక్కడి వాచ్ మెన్ ఆరోపిస్తున్నాడు. క్యాంప్ కార్యాలయంలో ఉన్న ఫర్నిచర్ ధ్వంసమైంది. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం బోరుగడ్డ అనిల్ కుమార్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఏపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్గా వ్యవహరిస్తు?న్నారు. రెండురోజుల క్రితం బోరుగడ్డ అనిల్ కుమార్ కోటంరెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కోటంరెడ్డి లాంటి వాళ్లు జగన్మోహన్ రెడ్డి కాలి గోటి మట్టితో సమానం అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి కోసం చంపడానికైన చావడానికైన సిద్ధమని ప్రకటించారు. ఇక, చంద్రబాబు తన బినామీ సొమ్ముతో వైసీపీ ఎమ్మెల్యేలను కొనే ప్లాన్ వేస్తున్నాడని ఆరోపణలు గుప్పించారు. ఎవరు నాయకుడో, ఎవరు మోసం చేసారో అనే విషయాన్ని ప్రజలు నిర్ణయిస్తారన్నారు. నేను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికి వీరాభిమానిని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ పై అవాకులు చవాకులు పేలితే , కోటంరెడ్డిని కుక్కను కొట్టినట్టు కొట్టి రోడ్డున ఈడ్చుకువస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఇక, టికెట్లు దక్కవని తెలిసిన నాయకులే ఇలాంటి అసమ్మతి నాటకాలు ఆడుతున్నారని వ్యాఖ్యానించారు.

## కొల్లుపై మండిపడ్డ పేర్ని

మచిలీపట్నం టీడీపీ నేత కొల్లు రవీంద్ర నూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని నాని పై విరుచుకపడ్డారు. ఖరీదైన భూమిని వైస్సార్సీపి నేతలు కాజేస్తున్నారు అని శ్రీరంగనీతులు చెబుతూ డ్రామా చేసి ఉద్దేశ పూర్వకంగా చేసి, డ్రామా చేసి కేసులు కట్టించుకొని సానుభూతి రాజకీయాలు చేసే నవరస నటసర్వభౌమ. అసలు ప్రభుత్వ భూములపై కన్నేసింది ఎవరు. సీఎం ను మంగళగిరి లో తిడుతున్న భూమి 99 ఏళ్ళు లీజు ఎవరిది. 3.65 ఎకరాల మిరెట్ల కట్టారు. విజయవాడ దగ్గర రమేష్ ఆసుపత్రి దగ్గరలో 493/1 11-10-2018 33 ఏళ్ల లీజు 95 సెంట్లు సంవత్సరానికి 1000 చొప్పున లీజు అది ఎంత ఖరిదైనది. శ్రీకాకుళం లో 2 ఎకరాలు జీవో (నెంబర్ 318, 2015 లో) టెక్కలి లో 33 ఏళ్ళు లీజు, హైదరాబాద్ లో ఎన్టీఆర్ భవనం అయితే 99 ఏళ్ళు లీజు తీసుకున్నారు.చిత్తూరు లో 1.27, విజయనగరం 1 ఎకరం. గుంటూరు, చిలకలూరిపేట లో 2018 లో 20 సెంట్లు, ప్రకాశం, ఒంగోలు 1.10 ఎకరాలు- జీవో 518,విశాఖపట్నం లో 2వేల గజాలుజ ఆంధ్ర బ్యాంక్ కి ఇచ్చినా స్థలం వేరు, పార్టీ ఆఫీస్ కి ఇచ్చిన స్థలం వేరు, ఇండోర్ స్టేడియం కి ఇచ్చిన స్థలం వేరు. ఎందుకు ఇంత డ్రామాలు, ఎందుకు ఈ జన్మ అని నిలదీసారు. మంత్రిగా ఉండి పచ్చి డ్రామాలు, శ్రీరంగ నీతులు చెప్పే బందరు కమల్ హాసన్.ఆర్ఎస్ నెంబర్ 390, 394 ప్రభుత్వ స్థలం ఉంది అది పార్టీ కార్యాలయం ఏర్పాటుకు ఇవాలని కలెక్టర్ కు అర్జి పెట్టాం. పోలీస్ లను కొట్టి, తిట్టి కేసులు కట్టించుకొని ఊరేగింపులు... సిగ్గుండాలి వాళ్ళు లేకపోతే మీరు బ్రతుకలేరు. అసలు ప్రభుత్వ భూములు లీజు కు పూనుకుంది ఎవరు? ప్రజల్లో రాజకీయ్య నాయకులంటే విలువలు లేకుండా పోతున్నాయి అంటే నీలాంటి వాళ్ళను బట్టే. టీడీపీ కి ప్రభుత్వ భూములు ఆడిగిందే మీరు..దమ్మున్న ఆఫీసర్ లు వున్నారు కాబట్టి అది ఇవ్వలేదు. సిగ్గులేకుండా ఈ డ్రామాలు, నాటకాలు, సంబరాల రాంబాబు వి. సినిమావాళు ళ నువ్వు పిలిస్తే రావట్లేదని నువ్వే డాన్స్ లు వేస్తూ నాటకాలు వేస్తున్నావు. దిక్కుమాలిన నాటకాలు మానేసి నిజాయితీ రాజకీయాలు చేయండి.

## గొలుసు దొంగల ఆరెస్టు

పాలకొల్లు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు లో రెండు నెలలుగా చైన్ స్నాచింగ్ పాల్పడుతూ జిల్లా పోలీసులను ముప్పు తిప్పలు పెడుతున్న ఇద్దరు చైన్ స్నాచర్ల ను అరెస్టు చేసి వారి వద్ద నుండి సుమారు30.24 లక్షలు విలువ చేసే 63.5 కాసుల బంగారు ఆభరణాలను మూడు బైక్ లు,రెండు సెల్ ఫోన్ లు స్వాధీనం చేసుకున్నారు.జిల్లా ఎస్పీ రవి ప్రకాష్ తెలిపిన వివరాలు ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం వెంప గ్రామానికి చెందిన దేవర నాగేశ్వరరావు ఏ నాని, బొక్క వర సత్య లక్ష్మీనారాయణ ఏనరేష్ లు చెడు వ్యసనాల కు బానిసలు అయ్యి ఆన్లైన్ జూదము బెట్టింగ్ లకు అలవాటుపడిన ఇద్దరు యువకులు ఈజీ మనీ కోసం ఒంటరిగావెళ్లే గుళ్ళకు వెళ్లే మహిళలు టార్గెట్గా 22 చైన్స్ మహిళలు మెడ నుండి చైన్ స్నాచ్చింగ్ లు చేయడంను ఎంచుకున్నారు. దొంగలించిన బైక్ ల పై జిల్లా లో తిరుగుతూ గత రెండు నెలలు కాలం లో జిల్లాలోని 11 పట్టణాలు పాలకొల్లు,నరసాపురం,మొగల్తూరు, భీమవరం,కాళ్ల, పెనుమంట్ర,ఇరగవరం,వీరవాసరం, తణుకు,కృష్ణ జిల్లా కృత్తివెన్నులలో 22 చైన్ స్నాచింగ్ లు,స్నాచింగ్ లుచేయడానికి రెండు బైక్ ల దొంగతనాలకు పాల్పడ్డారు.

## మార్చి 22, 23 తేదీల్లో విశాఖలో గృహ ప్రవేశం

విశాఖపట్టణం, ఫిబ్రవరి 7, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి విశాఖపట్నం తరలి వెళ్లే అంశం మళ్లీ తెరైపైకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఏపీకి చెందిన ముఖ్యనాయకుడు, మంత్రులు సిఎం విశాఖపట్నం వెళ్తారని అక్కడి నుంచి పరిపాలనా కార్యకలాపాలు నడిపిస్తారని చెబుతున్నారు. నిజానికి 2019 డిసెంబర్‌లో అసెంబ్లీలో ముఖ్యమంత్రి మూడు రాజధానుల ప్రకటన చేసినప్పటి నుంచి రకరకాల నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయింది.మూడు రాజధానుల ప్రకటన తర్వాత రైతుల ఆందోళనలు మొదలయ్యాయి. ఆ తర్వాత కోవిడ్ ముంచుకు వచ్చింది. ఆందోళనలు, ఉద్యమాలు, ప్రతిపక్షాల విమర్శలు, పోరాటాల నడుమ రాజధాని అంశంపై కోర్టు కేసులు దాఖలయ్యాయి. దీంతో ముఖ్యమంత్రి నిర్ణయం అసెంబ్లీలో ప్రకటనకే పరిమితం కావాల్సి వచ్చింది. మూడు రాజధానులపై అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బిల్లులు మండలిలో నెగ్గకపోవడంతో ఆ తర్వాత వాటిని ఉపసంహరించుకున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ హైకోర్టు రాజధాని భూ సమీకరణపై రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆదేశించింది.హైకోర్టు ఆదేశాలపై ఉపశమనం కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ పరిణామాల మధ్య విశాఖకు రాజధాని తరలింపు పనులపై క జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. రాజధాని తరలింపుపై ఎలాంటి నిర్ణయం వచ్చినా పాటించేందుకు వీలుగా అధికారులు చర్యలు ప్రారంభించారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని త్వరలో విశాఖకు తరలిపోతుందని, తాను అక్కడి నుంచే పాలన సాగిస్తానని సీఎం జగన్ ఇటీవల దిల్లీలో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో సైతం ప్రకటించారు. పలువురు మంత్రులు సైతం కొంతకాలంగా ఇదే విషయాన్ని చెబుతూ వస్తున్నారు. ఈ పరిణామాలపై జిల్లా యంత్రాంగానికి అధికారికంగా ఎలాంటి ఆదేశాలు రాకున్నా, రాష్ట్ర ప్రభుత్వ పెద్దల నుంచి మాత్రం మౌఖిక ఆదేశాలు అందుతున్నట్లు తెలుస్తోంది.రాజధాని తరలింపునకు సంబంధించిన సమాచారం ఏక్షణంలో వచ్చినా ఏర్పాట్లు చేసేందుకు వీలుగా అధికారులు సిద్ధమవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లోని భవనాలనుపరిశీలిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ విశాఖలో నివాసం ఉండడానికి బీచ్ రోడ్డులో అనువైన ఇంటి కోసం అధికారులు అన్వేషణ ప్రారంభించారు.ముఖ్యమంత్రి నివాసానికి అనుకూలమైన ఇల్లు లబిస్తే మార్చి 22, 23 తేదీల్లో గృహ ప్రవేశం ఉ ంటుందనే ప్రచారం

పార్టీ వర్గాల్లో విస్తృతంగా సాగుతోంది. వీఎంఆర్‌డీఏ అధికారులు ఇటీవల ఎంవీపీ న్యాయ విద్యా పరిషత్తు పక్క నుంచి రహదారి విస్తరణ పనులను చేపట్టారు. ఈ మార్గంలోనే సీఎం నివాసం ఉంటుందని చెబుతున్నారు. మంత్రులు కూడా తమకు అనుకూలమైన భవనాల కోసం వెతుకుతున్నారు.మరోవైపు ఏఎంసీ అంకోశా సమీపంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల కోసం చేపట్టిన డూప్లెక్స్ ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. సీనియర్ ఐఏఎస్ అధికారులు కూడా విశాఖలో నివాసాల కోసం అన్వేషిస్తున్నారు. ముఖ్యమంత్రి ఎక్కడి నుంచైనా పాలన చేసే వెసులుబాటు ఉండటంతో అధికారులు, సిబ్బందిని పూర్తి స్థాయికు తరలింపు ఎంతవరకు ఉంటుందనేది ప్రశ్నార్థకంగా ఉంది. మరోవైపు విద్యార్థులకు పరీక్షలు ముగిసిన తర్వాత ఏప్రిల్, మే నెలల్లో కార్యాలయాల తరలింపు ఉ ంటుందని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## అంగన్వాడి అందోళన

కాకినాడ సుప్రీంకోర్టు తీర్పు గ్రాడ్యుటి అమలుచేయాలని, 2017నుండి పెండింగ్ ఉన్న టీఏ బిల్లులు చెల్లించాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేయలని, రాజకీయ వేధింపూలు, అక్రమ తొలగింపులు ఆపాలని కోరుతూ కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్లో సీఐటీయూ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం పిఠాపురం ప్రాజెక్ట్ సీడీపీవో దుర్గాదేవికి అందించారు.ఏపీ అంగన్వాడీ వర్కర్స్ ఉ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలైన దడాల పద్మ ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాలో రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబిరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రవతి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు అంగన్వాడీలకు తెలంగాణలో ఇస్తున్నవేతనం కంటే అదనంగా వెయ్యి చెల్లిస్తానని చెప్పి, నేడు తెలంగాణ రాష్ట్రం కంటే 2000 తక్కువ వేతనాలు చెల్లిస్తు మాట తప్పారన్నారు. కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు అంగన్వాడీలకు గ్రాడ్యుటీ అమలు చేస్తూ జీవో ఇచ్చిందని, జగన్ ప్రభుత్వం కూడా రాష్ట్రంలో అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫుడ్ కమిషనర్ ప్రతాప్ రెడ్డి చిరుద్యోగులపై ఎటకారంగా మాట్లాడడం మానుకోవాలని హెచ్చరించారు. చేతనైతే అంగన్వాడీ సెంటర్లలో పిల్లలకు పెట్టే మెనూ సరుకులు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంవత్సరాల తరబడి బిల్లులు పెండింగ్ పెడితే సెంటర్లను ఎలా నిర్వహించాలని ప్రశ్నించారు. కనీసం నెల నెల వేతనాలు కూడా చెల్లించలేని దౌర్భాగ్య పరిస్థితికి జగన్ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పేరుతో మహిళల సానిటరీ నేప్కిన్స్ పై కూడా పన్నులు వేస్తూ, పెట్రోల్ డీజిల్ ధరలను రోజురోజుకీ పెంచుతూ నిత్యవసర సరుకులు ధరలను విపరీతంగా పెంచుతుందని విమర్శించారు. బడుగు బలహీన వర్గాల పిల్లలకు పౌష్టిక ఆహారం అందించే ఐసీడీస్ కు బడ్జెట్ లో నిధులు తగ్గించి పేద పిల్లలకు అన్యాయం చేశారని, గర్భిణీలు, పిల్లలు తినగలిగేలా నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, పేదలకు సేవచేసే అంగన్వాడీలకు కేంద్ర ప్రభుత్వం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నల్లధనం తీసుకొచ్చి ప్రతి ఒక్కరి అకౌంట్లో 15 లక్షలు ఎప్పుడు వేస్తారని ప్రశ్నించారు. ఫెస్ యాప్ రద్దు చేసేంతవరకు ఈ ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. చేసే పని ఒకేలా ఉన్నా మినీ వర్కర్ అనే పేరుతో గొడ్డుచాకిరి చేయించుకుంటున్నారని, తక్షణమే మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలన్నారు. తాళ్లరేవు సీడీపీవో అంగన్వాడీలపై వేధింపులకు పాల్పడుతూ ఉద్యోగుల చేత బలవంతపు రాజీనామాలు చేయించడం మానుకుని, తొలగించిన వారిని విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులతో పెద్దాపురం తొలగించిన బ్రహ్మకుమారి అనే అంగన్వాడీని తక్షణమే విధులలోకి తీసుకోవాలన్నారు. డిమాండ్ల పరిష్కారంకోసం దశాలవారి పోరాటాలకు అంగన్వాడీలు సిద్ధపడలని పిలుపునిచ్చారు.

## దంపతుల ఘరానా మోసం

ఏలూరు ఏలూరుజిల్లా పెదవేగి మండలం కూచింపూడిలో ఘరానా మోసం బయటపడింది. ఉద్యోగాలు, కాంట్రాక్టు లు, కార్ లు ఇప్పిస్తానని ఓ వ్యక్తి గ్రామస్తుల వద్దనుంది కోటి రూపాయలు వసూలు చేసి రాత్రికి రాత్రే గ్రామం నుండి జంపయ్యాడు. భర్త ఇలా మోసం చేస్తే భార్య ఇల్లు అద్దెకిచ్చిన యజమానిని మరోలా మోసం చేసినట్టు తెలిసింది. కొంతమంది దగ్గర మాయమాటలు చెప్పి సుమారు కోటిరూపాయలు డబ్బులు గుంజుకుని పథకం ప్రకారం అద్దెకున్న ఇంటికి తాళం పెట్టి భార్యతో సహా ఓ వ్యక్తి వెళ్ళిపోయాడు. ఎన్ని రోజులైనా ఆ భార్యాభర్తలు రాకపోవడం తో ఇంటి యజమాని అద్దెకిచ్చిన గది తాళం తీసి గది లో ఏమైనా వస్తువులున్నాయేమోనని చూసి మళ్ళీ తాళం పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న అద్దెకు తీసుకున్న వ్యక్తి భార్య ప్రత్యక్షమై గదిలో తనకు గల బంగారం వస్తువులు కనబడటం లేదని పోలీసుకేసు పెట్టి ఇంటి యజమాని నుండి 1లక్షా 50 వేలు వసూలు చేసినట్టు తెలిసింది.కేసు వివరాలు ఇలా వున్నాయి. కూచింపూడిలో ఒక కిరాణా వ్యాపారం చేసుకునే వ్యక్తి ఇంటి లో ఒక గదిని ఎక్కడనుండో వచ్చిన ఒక వ్యక్తి తనబార్యతో కలిసి అద్దెకు తీసుకున్నాడు. అతను కారు డ్రైవర్ గా పనిచేసేవాడని తెలిసింది. ఇంటి ఓనర్ కు కూడా ఒక కారు ఉండడం తో అప్పుడప్పుడు ఇంటి ఓనర్ కార్ కూడా తొలేవాడు. ఇలా గ్రామం లో కొంతమంది ప్రముఖులకు ఆ కార్ డ్రైవర్ పరిచయ మయ్యాడు. తనకు సి ఎం వై ఎస్ జగన్ తెలుసని, సి ఎం తల్లి విజయమ్మ కూడా తెలుసని కూచింపూడిలో కొంతమందిని నమ్మించాడు. ఒక ఆర్ ఎం పి కి కార్ లోన్ ఇప్పిస్తానని విజయ వాడ ప్రభుత్వాసుపత్రి రోడ్డు లో ఉన్న ఒక హుండాయ్ కారు షోరూంలో 11 లక్షలు కట్టించి మరుసటి రోజు వెళ్లి కార్ లోన్ అక్కరలేదని ఆర్ ఎం పి వైద్యుడు షోరూం లో అడ్వాన్స్ గా ఇచ్చిన 11 లక్షలు స్వాహా చేశాడు. విషయం తెలుసుకున్న ఆర్ ఎం పి వైద్యుడు జరిగిన మోసం గ్రామం లో చెప్పుకుని లబో దిబో మన్నాడు. గ్రామం లో కొంత మంది నుండి కాంట్రాక్టు లు ఇప్పిస్తానని 25 లక్షల వరకు వసూలు చేసాడు. ఉద్యోగాలు ఇప్పిస్తానని కొంత మంది దగ్గర లక్షల్లో సొమ్ములు తీసుకున్నాడు. ఇల్లు అద్దెకిచ్చిన వ్యక్తి బంధువు దగ్గర ఇంపోర్టెడ్ పాలిష్ రాళ్లు దిగుమతి చూపిస్తానని లక్షలాది రూపాయలు తీసుకుని ఒక మంచి ముహూర్తం చూసి ఓ అర్ధరాత్రి జెండా ఎత్తేశాడు. తమగోడు ఎవరితో ఎలా చెప్పుకోవాలో అర్థం కాక గ్రామ పెద్దలతో సమాలోచనలు చేస్తున్నారు. ఈ ఘరానా మోసగాడి బంధువు కూడా కూచింపూడిలో కాపురం ఉంటున్నాడు. అసలు విషయం ఏమిటంటే సొమ్ములు వసూలు చేసి ఊరు వదిలి పారిపోయిన కొద్దిరోజుల కు ఆ వ్యక్తి భార్య గ్రామానికి వచ్చి అద్దెకున్న గదిలో బంగారం పోయిందని ఇంటి ఓనర్ పై కేసు పెట్టి గ్రామ పెద్దలతో రాజీ కుదుర్చుకుని ఇంటి ఓనర్ నుండి 1ళ్ళక్షా 50 వేలు వసూలు చేయడమే కాక తన భర్తను ఏంచేసారో చెప్పాలని లేదంటే కేసు పెట్టాల్సి వస్తుందని బెదిరించింది. దాంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

## గుడివాడ నుంచే పోటీ

విజయవాడ, ఫిబ్రవరి 7,హాట్ కామెంట్స్‌తో హీట్ పుట్టించే కాంగ్రెస్ ఫైర్ బ్రాండ్ రేణుకాచౌదరి ఈసారి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. తాను తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు. అది కూడా వైసీపీ ఫైర్ బ్రాండ్ కొడాలి నాని ప్రాతినిధ్యం వహిస్తోన్న గుడివాడ నుంచి బరిలోకి దిగబోతున్నట్లు చెప్పారు. మొన్నటివరకూ ఉమ్మడి రాష్ట్రమే కదా? ఏపీలో పోటీ చేస్తే తప్పేంటి అన్నారు. ఏపీలో పోటీ చేయాలని తనపై ఒత్తిడి వస్తోందని, అందుకే గుడివాడపై ఆలోచిస్తున్నట్లు చెప్పుకొచ్చారు.వచ్చే ఎన్నికల్లో ఖమ్మం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తానంటోన్న రేణుకాచౌదరి? గుడివాడ కూడా తన మనసులో ఉందన్నారు. రెండు చోట్లా పోటీ చేయడంపై సీరియస్‌గా ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ఇక, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై పరోక్షంగా హాట్ కామెంట్స్ చేశారు రేణుక. ఎవరొచ్చినా స్వాగతిస్తామంటూనే? ఎక్కడా దిక్కులేని వాళ్లకు కాంగ్రెస్ దిక్కంటూ సెటైర్లు వేశారు.

## నేడు భారత 3వ రాష్ట్రపతి జాకిర్ హుస్సేన్ జయంతి



డాక్టర్ జాకిర్ హుస్సేన్ భారత 3వ రాష్ట్రపతి గా మే 13 1967 నుండి 1969 మే 3 న మరణించినంతవరకు పనిచేశారు. ఫిబ్రవరి 8, 1897 న జాకిర్ హుస్సేన్ హైదరాబాదు భారతదేశం ( తెలంగాణ రాజధాని హైదరాబాద్)లో జన్మించాడు. ఇతని తండ్రి పఖ్తూన్ జాతికి చెందినవాడు. ఇతడు హైదరాబాదు నుండి ఉత్తరప్రదేశ్ లోని ఫరూఖాబాద్ జిల్లా ఖాయిమ్ గంజ్ కు వలస వచ్చాడు. హుసేన్ ఇటావా (ఉత్తరప్రదేశ్) లోని 'ఇస్లామియా ఉన్నత పాఠశాల' లో చదువుకున్నాడు, ఉన్నతవిద్య అలీఘర్ లోని ఆంగ్లో మహమ్మడన్ ఓరియంటల్ కాలేజిలో అభ్యసించాడు. ఆయన విద్యార్థిసంఘ నాయకుడిగా పనిచేశారు. హుసేన్ 23 సంవత్సరాల వయస్సులో ఢిల్లీ దగ్గర, ఒక జాతీయ ముస్లిం విశ్వవిద్యాలయాన్ని స్థాపించి, దానికి జామియా మిల్లియా ఇస్లామియా అనే పేరు పెట్టాడు. తరువాత ఇతను విత్తశాస్త్రంలో పి.హెచ్.డి. చేసేందుకు, 'బెర్లిన్ విశ్వవిద్యాలయానికి జర్మనీ వెళ్ళాడు. జర్మనీలో ఉన్నప్పుడు గాలిబ్ జీవితగాథ, కవితాసంగ్రహాలను క్రోడీకరించాడు. భారతదేశానికి తిరిగి వచ్చి, జామియా మిల్లియా ఇస్లామియాకు మార్గదర్శకుడిగా మారాడు. బ్రిటిష్ వారితో పోరాటానికి, మహాత్మా గాంధీతో చేతులుకలిపి, "బేసిక్ విద్య" పై కఠోర పరిశ్రమ చేశాడు. భారతదేశంలో విద్యాభ్యుదయానికి శ్రమించాడు. ఈ కాలంలో హుసేన్ ఉత్తమ దార్శనికుడిగా, భారత విద్యావిభాగ మార్గదర్శకునిగా గుర్తింపు పొందాడు. తమ రాజకీయ ప్రత్యర్థియైన మహమ్మద్ అలీ జిన్నా చేతగూడా పొగడబడ్డాడు. తన వ్యక్తిగత సంపదనంతా భారతదేశానికి ధారబోసిన దేశభక్తుడు. భారత స్వాతంత్ర్యం తరువాత, అలీఘర్ ముస్లిం యూనివర్శిటి వైస్ ఛాన్సలర్ పదవి చేపట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన ప్రథమ దశలో విద్యార్థుల ఉద్యమాలను, ముఖ్యంగా అలీఘర్ లో అదుపులో ఉంచుటకు ఇతని నియామకం ఎంతో ఉపయోగపడింది. వైస్ ఛాన్సలర్ పదవీకాలం ముగిసిన తరువాత 1956 లో పార్లమెంటు సభ్యునిగా నామినేట్ చేయబడ్డాడు. 1957 లో బీహారు గవర్నరుగా నియమింపబడి, పార్లమెంటుకు రాజీనామాచేశాడు. బీహారు గవర్నరుగా 1957 నుండి 1962 వరకు సేవలందించిన తరువాత 1962 నుండి 1967 వరకు భారత ఉప రాష్ట్రపతి పదవిని అలంకరించాడు. తదనంతరం మే 13 1967 న భారతరాష్ట్రపతిగా ఎన్నుకోబడ్డాడు. ఇతని ప్రథమ ఉపన్యాసంలో "మొత్తం భారతదేశం నా ఇల్లు, ప్రజలందరూ నా కుటుంబం" అని పేర్కొన్నాడు. అత్యల్పకాలం రాష్ట్రపతి పదవి నిర్వహించిన మొదటి వ్యక్తి. రాష్ట్రపతి పదవిలో ఉండగా మరణించిన మొదటి వ్యక్తి కూడా ఆయనే. ఇప్పటి వరకు ఇద్దరు రాష్ట్రపతులు పదవిలో ఉండగా - డా.జాకీర్ హుస్సేన్, ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ లు మరణించారు. ఈయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 1963 లో 'భారతరత్న' పురస్కారాన్ని అందించింది.

## గెత్సేమనే ప్రార్థన పండుగల పోస్టర్ ఆవిష్కరణ

డోన్ గెత్సేమనే ప్రార్థన పండుగ ల పోస్టర్ ఆవిష్కరణ జరిగింది, పట్టణములోని స్థానిక మార్కెట్ యార్డ్ ఎదురుగా ఉన్న క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ గ్రౌండ్ నందు ఈనెల 20 తేదీ నుండి 24 తేదీ వరకు జరిగే ఐదు రోజుల ప్రార్థనా పండుగలు యొక్క పోస్టర్ ను సమైక్య సంఘం ప్రెసిడెంట్ రెవరెండ్ బందెల రాజు పాస్టర్ల ప్రెసిడెంట్ రెవరెండ్ ఆనందరావు ల ఆధ్వర్యంలో పోస్టర్ లను ఆవిష్కరించారు, ఈ సందర్భంగా సభల కన్వీనర్ సామ్యూల్ పాస్టర్ మాట్లాడుతూ ఈ ఐదు రోజుల పండుగలకు అంతర్జాతీయ సువార్తికులు బ్రదర్ అనిల్ కుమార్ 24 వ తేదీ ప్రత్యేకమైన వర్తమానము అందిస్తారని అలాగనే అంతర్జాతీయ ప్రసంగీకులు రాజశేఖర్, డేనియల్ పాల్, సంగీత , ఎర్నెస్ట్ పాల్,జార్జ్ బుష్ , చిన్ని సవరపు ఈ సభలకు ముఖ్య ప్రసంగీకులుగా వస్తున్నారు, ఐదు రోజుల సభలలో వేలాదిగా క్రైస్తవులు పాల్గొని దైవ దీవెనలు పొందాలని సామ్యూల్ పాస్టర్ పిలుపునిచ్చారు,ఈ కార్యక్రమంలో సమైక్య పెద్దలు, డోన్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ పాస్టర్స్ ,రెవరెండ్స్,తదితరులు పాల్గొన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్ ఎదురుగా క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ గ్రౌండ్ నందు ఈనెల 20 తేదీ నుండి 24 తేదీ వరకు జరిగే ఐదు రోజుల ప్రార్థనా పండుగలు యొక్క పోస్టర్ ను సమైక్య సంఘం ప్రెసిడెంట్ రెవరెండ్ బందెల రాజు పాస్టర్ల ప్రెసిడెంట్ రెవరెండ్ ఆనందరావు చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభల కన్వీనర్ సామ్యూల్ పాస్టర్ మాట్లాడుతూ ఈ ఐదు రోజుల పండుగలకు అంతర్జాతీయ సువార్తికులు బ్రదర్ అనిల్ కుమార్ 24వ తేదీ ప్రత్యేకమైన వర్తమానము అందిస్తారని అలాగనే అంతర్జాతీయ ప్రసంగీకులు రాజశేఖర్ , డేనియల్ పాల్ , సంగీత , ఎర్నెస్ట్ పాల్ , జార్జ్ బుష్ , చిన్ని సవరపు ఈ సభలకు ముఖ్య ప్రసంగీకులుగా వస్తున్నారు .ఈ ఐదు రోజుల సభలలో వేలాదిగా క్రైస్తవులు పాల్గొని దైవ దీవెనలు పొందాలని సామ్యూల్ పాస్టర్ పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో సమైక్య పెద్దలు, డోన్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ పాస్టర్స్ ,రెవరెండ్స్, పాల్గొన్నారు.

# బద్వేల్ లో రెచ్చిపోతున్న నకిలీ ఇంటి పట్టాల గ్యాంగులు



లుబద్వేలు , బద్వేల్ లో నకిలీ పట్టాల గ్యాంగులు ఇటీవల కాలంలో మరింత రెచ్చిపోతున్నాయి విలువైన ప్రభుత్వ స్థలాలను తప్పుడు పత్రాలతో కాజేసే ప్రయత్నం ముమ్మరంగా జరుగుతున్నాయి ఈ స్థలం మాదంటూ అక్కడ వాలిపోయి ఆక్రమించేస్తున్నారు మాకు రెవెన్యూ అధికారులు ఇచ్చిన పట్టా ఉందంటూ నకిలీ పట్టాలు సృష్టించి స్థలాలను ఆక్రమించే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి మా స్థలాలు ఆక్రమిస్తారా అంటూ బెదిరింపులకు దిగుతూ వివాదాస్పదంగా మార్చేస్తున్నారు ఇవన్నీ పలానా వారి పట్టాలు వారితో మీరు పోరాటాలు చేయలేరు ఎంతోకొంతకు సెటిల్మెంట్ చేసుకోవడానికి అన్ని హక్కులు ఉన్నవారికి ఉచిత సలహాలు ఇస్తున్నారు వెరసి లక్షలాది రూపాయలు విలువచేసే ఇంటి స్థలాలను పెద్దలు కొట్టేస్తున్నారు ఇందులో నకిలీ ఇంటి పట్టాల గ్యాంగ్ మరింత బరితెగించింది బద్వేలు గోపవరం మండలాల్లో ఇప్పటికీ పదికి పైగా నకిలీ ఇంటి పట్టాలు తయారు చేసే గ్యాంగులు ఉన్నాయి ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే బద్వేల్ పట్టణం బద్వేలు గోపవరం మండలాల జంట కలయిక ఈ రెండు మండలాల్లో ప్రభుత్వ భూములే ఎక్కువ ఇక్కడ ఓకే ఇంటి పట్టాపై మూడు నాలుగు పట్టాలు పుట్టుకు రావడం గమనార్హం నకిలీల బాగోతం వెనుక కొందరు రెవెన్యూ సిబ్బంది ఉన్నట్లు ఎప్పటినుంచో ఆరోపణలు లేకపోలేదు బద్వేలు గోపవరం మండలాల రెవెన్యూ పరిధిలో అధికారులు గతంలోనే వందల సంఖ్యలో ఇంటి పట్టాలు ఇచ్చారు ఆర్థికంగా బాగా ఉన్నవారు తమకు కేటాయించిన ఇంటి స్థలాల్లో ఇల్లు నిర్మించుకున్నారు అప్పట్లో ఈ స్థలాలు పట్టణ శివారు ప్రాంతంలో ఉండడంతో ఆర్థికంగా బాగా లేని వారు నిర్మాణాలు చేపట్టలేదు ఇదే అక్రమార్కులకు నకిలీ ఇంటి పట్టాల గ్యాంగులకు బాగా కలిసి వచ్చాయి బద్దెల పట్టణంలో నివాసం ఉండేందుకు అట్లూరు గోపవరం బ్రహ్మంగారిమఠం బి కోడూరు మండలాల ప్రజలతోపాటు నెల్లూరు జిల్లా సరిహద్దుల్లో గ్రామాల వారు కూడా ఎంతో ఆసక్తి చెబుతున్నారు తెలుగు గంగ సోమేశుల ప్రాజెక్టు ముంపు వాసులు కొందరు బద్వేల్ లో నివాసం ఉండేందుకు ఇల్లు నిర్మించుకునేందుకు ఎంతో ఆసక్తి చూపుతున్నారు దీంతో పట్టణం మైదుకూరు నెల్లూరు సిద్ధవటం రహదారుల్లో బాగా విస్తరిస్తుంది ఈ మూడు రహదారుల్లో భూకబ్జాదారులు కొండలు వాగులు వంకలు సైతం వదలడం లేదు చెన్నంపల్లె గుంతపల్లి మడకలవారిపల్లె ఉన్న ప్రాంతాల్లో రెవెన్యూ పొలాలకు స్థలాలకు మంచి డిమాండ్ ఉంది మైదుకూరు నెల్లూరు రహదారి సంబంధించి 67 నెంబర్ జాతీయ రహదారి వెళుతుంది ఈ రహదారి పక్కనే ఎంతో విలువైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి వీటిని గత కొద్ది రోజులుగా భూ కబ్జాదారులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు చివరికి కొండలు సైతం వదిలిపెట్టలేదు ప్రాంతాన్ని బట్టి ఇక్కడ సెంటు స్థలం 8 లక్షల రూపాయల నుంచి 15 లక్షల రూపాయలు పలుకుతుంది పోరంబోకు స్థలాలు ప్రభుత్వ స్థలాలు ఇప్పటికే భూకబ్జాదారులు పలువురు ఆక్రమించేశారు

## తప్పుడు పత్రాలతో హక్కుదారుల స్థలాలు కాజేసే ప్రయత్నాలు ఇప్పటికే బద్వేలు ఆర్డీవోకు బాధితుల ఫిర్యాదు

దీంతో విలువైన స్థలాలు కాజేసే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి బద్వేలు చెందిన ఇద్దరు మాజీ స్టాంప్ వెండర్లు నకిలీ ఇంటి పట్టాల తయారీలో కీలక పాత్ర ఇప్పటికీ పోషిస్తున్నారు బద్వేలు రెవెన్యూ డివిజన్ అయిన తర్వాత ఆర్డీవో గా ఆకుల వెంకటరమణ దాదాపు పది మాసాల క్రితం బాధ్యతలు స్వీకరించారు ఆయన వచ్చిన తర్వాత నకిలీ ఇంటి పట్టాలపై పూర్తిగా దృష్టిపెట్టారు నకిలీ ఇంటి పట్టాలు తయారు చేస్తున్న దాదాపు 25 మందిపై కేసులు పెట్టారు వీరిలో కొందరిని పోలీసులు అరెస్ట్ చేశారు వీరిలో కొంతమంది రెవెన్యూ ఉద్యోగులు ఉండడం విశేషం అలాగే అధికార పార్టీ చెందిన మరో నలుగురు నకిలీ పట్టాల తయారీలో కీలక పాత్ర పోసి ఇచ్చినట్లు అధికారులు గుర్తించి వారిలో ఇద్దరిపై కేసులు నమోదు చేశారు నకిలీ ఇంటి పట్టాల కారణంగా ఎంతోమంది ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారు అసలైన లబ్ధిదారులొచ్చి ఈ స్థలం మాది అని పత్రాలు చూపించిన వాటి స్థానంలో నకిలీ పట్టాలు చూపించి బెదిరింపులకు దిగుతున్నారు సద్దు మణిగిన ఈవారం ఇటీవల కాలంలో మరింత పుంజుకుంది పట్టణంలో ఎన్జీవోలకు గతంలో 8 సెంట్లు ప్రకారం పట్టాలు ఇచ్చారు అప్పుడు ఈ స్థలాలు పట్టణ శివారు ప్రాంతంలో ఉండేవి కానీ ఇప్పుడు పట్టణానికి ప్రధాన కేంద్రంగా మారింది వాటిపై కన్నేసిన పలు గ్యాంగులు నకిలీ ఇంటి పట్టాలు తయారుచేసి అమ్మకాలకు తెర లేపారు బద్వేల్ మండలం మునుపటి చెన్నంపల్లి పంచాయతీ 17 90/1 1790/2 1790/3 సర్వే నెంబర్లలో నకిలీ ఇంకిపట్టావా తయారీ గ్యాంగులు ఇటీవల మరింత రెచ్చిపోతున్నాయి నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలానికి చెందిన కొందరు వ్యక్తులు కూడా ఈ విషయంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు సమాచారం వీరికి బద్వేల్ లో ఉన్న కొన్ని గ్యాంగులు సహకారం అందిస్తున్నాయి అంతేగాక వీరు నకిలీ అగ్రిమెంట్లు కూడా తయారు చేయడం విశేషంబద్వేల్ లో నకిలీ ఇంటి స్థలాల అగ్రిమెంట్లు ఫోర్జరీ సంతకాలు నకిలీ ఇంటి పట్టాలపై ఆర్డిఓ ప్రత్యేక దృష్టిఇప్పటికే పలువురు బాధితులు ఆర్డీవోకు రాత పూర్వక ఫిర్యాదులుబద్వేల్ ప్రాంతంలో ఏదేచ్ఛగా చాలా కాలంగా కొనసాగుతున్న నకిలీ ఇంటి స్థలాల అగ్రిమెంట్లు ఫోర్జరీ సంతకాలు నకిలీ ఇంటి పట్టాలపై ఆర్డీవో ఆకుల వెంకటరమణ ప్రత్యేక దృష్టి సాధించారు ఇప్పటికే వీటిపై పలువులు బాధితులు ఆర్డీవోకు రాత పూర్వకంగా తగిన ఆధారాలతో ఫిర్యాదులు చేశారుఇందుకు సంబంధించి కొంతమంది బ్రోకర్లు ముఖ్యమైన వ్యక్తులపై ఫిర్యాదులు చేసినట్లు సమాచారం వీటిని ఆర్డీవో ప్రత్యేకంగా పరిశీలించినట్లు తెలిసింది ఇందుకోసం ప్రత్యేక రెవెన్యూ పోలీస్ బృందాలను నిమ్మిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం ఈ విషయం బయటికి తొక్కడంతో నకిలీ పట్టదారులు నకిలీ ఇంటి స్థలాల అగ్రిమెంట్ దారులు ఫోర్జరీ సంతకాలు తయారుచేసి హక్కుదారునికి ఏమాత్రం సంబంధం లేకుండా ఇంటి స్థలాలు అమ్మిన వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం చాలామంది బేస్ మట్టాలు ఆక్రమించి వాటిని పూర్తిగా ధ్వంసం చేసి కొత్తగా అదే స్థలంలో నిర్మాణాలు చేపట్టే వారిపై కూడా చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు పదే పదే హెచ్చరిస్తున్నారు గతం వేరు ఇప్పుడు వేరని ఆ చెబుతున్నారునకిలీ అగ్రిమెంట్ల కేంద్రంగా బద్వేలునకిలీ ఇంటి పట్టాలకు కేంద్రమైన బద్వేలు ఇప్పుడు నకిలీ అగ్రిమెంట్లకు కూడా



కేంద్రంగా మారింది ఇంటి పట్టా కలిగిన హక్కుదారునికి ఏ మాత్రం సంబంధం లేకుండానే నకిలీ అగ్రిమెంట్లు సృష్టించి స్థలాలు తమకే అమ్మినట్లు తయారు చేస్తున్నారు ఇందుకు కొన్ని ప్రత్యేకమైన గ్యాంగులు ఉన్నాయి బద్వేల్ లో పదిమంది కలిసి ఒక గ్యాంగ్ గోపవరం మండలంలో మూడు గ్యాంగులు బి కోడూరు మండలంలో నాలుగు గ్యాంగులు అట్లూరు మండలంలో మరో నాలుగు గ్యాంగులు ఉన్నాయి ఇందులో కొందరు మహిళలు కూడా ఉన్నారు ఫోర్జరీ సంతకాలు చేయడంలో వీరుగానపాటీలు అని చెప్పాలి ఎవరి సంతకమైనా ఈ అధికార సంతకమైన ఏమాత్రం అనుమానం రాకుండా చేసేస్తారు ఇటువంటి మహిళలపై ఇప్పటికే పోలీస్ కేసు నమోదయింది తాసిల్దార్ జిల్లా కలెక్టర్ తో పాటు ప్రైవేట్ వ్యక్తుల సంతకాలు కూడా ఏమాత్రం తీసుకోకుండా అచ్చు గుద్దినట్లు చేసేస్తారు వీరు అంతా ఆరితేరిపోయారని చెప్పాలి చెప్పాలి విలువైన ఇంటి స్థలాలపై వీరికి ఎప్పటినుంచో కన్ను ఉంది మీరు వద్ద ఉన్న పాత అగ్రిమెంట్ల ద్వారా స్థలం హక్కుదారుని సంతకం అచ్చుకుద్దినట్లు చేసి తమకు స్థలం హ క్కుదారుడు విక్రయించినట్లు అగ్రిమెంట్లు తయారు చేస్తారు ఈ విషయం స్థలం కలిగిన అక్కుదారునికి ఏ మాత్రం తెలియదు వీరి వద్ద పాత అగ్రిమెంట్లు ఎన్నో ఉన్నాయి ఇది అందరికి తెలిసిన బహిరంగ రహస్యమే పాత తేదీలతో అగ్రిమెంట్లు తయారుచేసి ఇతరులకు లక్షలకు లక్షలకు విక్రయిస్తారు పాత అగ్రిమెంట్లు అసలైనవే నకిలీవ తెలుసుకోవడం అత్యంత కష్టం స్థలం గల హక్కుదారుడు సంతకం కూడా అచ్చు గుద్దినట్లు ఉంటుంది హక్కుదారుని ఇంటి వివరాలు అన్ని ముందుగానే తెలుసుకొని ఆ తరువాత రంగంలోకి దిగి ఎవరు కనుక్కొని విధంగా అగ్రిమెంట్లు తయారుచేస్తారు ఇవి బద్వేల్ లో ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తున్నాయి బద్వేలు పట్టణం సిద్ధవటం రోడ్డులో పూర్వపు చెన్నంపల్లి పంచాయతీ 1790/3 సర్వే నెంబర్లో హ క్కుదారునికి సంబంధం లేకుండానే ఇంటి స్థలంపై నకిలీ అగ్రిమెంట్ సృష్టించి ఇతరులకు విక్రయించారు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కంప సముద్రం గ్రామాన్ని చెందిన ఒక మహిళ బద్వేల్ లో కొంతమంది దళారులను పట్టుకుని వారి ద్వారా స్థలం అమ్మకం చేసినట్లు సమాచారం బ్రోకర్లు తమ బ్రోకరేజ్ చూస్తున్నారు తప్ప అసలు హక్కుదారుడు స్థలాన్ని విక్రయించాడా అగ్రిమెంట్ అసలుదా? నకిలీదా?స్థలం హక్కుదారుడు స్థలాన్ని విక్రయించాడా? అనే విషయాలు ఏమాత్రం పట్టించుకోకుండా స్థల విక్రయాలు జరిగిపోతున్నాయి ప్రభుత్వం ఇచ్చిన స్థలాలు హక్కుదారుడు అనుభవించాల తప్ప ఇతరులకు విక్రయించకూడదని బద్వేల్ ఆర్ డి ఓ ఆకుల వెంకటరమణ పదేపదే చెబుతూ వస్తున్నారు వంద రూపాయల బాండ్ పేపర్ పై స్థల విక్రయాలు జరిగినా అవి ఏమాత్రం చెల్లవని అవి చిత్తు కాగితంతో సమానమని ఆర్డిఓ ఇప్పటికే పలుమార్లు చెప్పడం జరిగింది

## ఖాళీ స్థలాలు కొంటున్నారా...జాగ్రత్త....

స్థలం కు 30 అడుగులు రోడ్డు ఉంటేనే అనుమతులు....

30 అడుగులు తక్కువుంటే అనుమతులు ఇవ్వరు....

లక్ష ఇస్తే అడుగులు తక్కువ ఉన్నా అనుమతులు....

ప్లానింగ్ సెక్రటరీ,ఎల్.టి.పీ.లు మధ్యవర్తులు....

ఏసీబీ,విజిలెన్స్, అధికారులు మమ్మల్ని ఏమి చేయలేరు....

మాస్టర్ ప్లాన్ బూచితో టౌన్ ప్లానింగ్ దోపిడీ....

టౌన్ ప్లానింగ్ అధికారుల్లో మార్పు నిల్.

నంద్యాల ఫిబ్రవరి 07 నంద్యాల టౌన్ ప్లానింగ్ విభాగంలో పని చేస్తున్న అధికారులు దనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. ఏసీబీ,విజిలెన్స్ అధికారులు దాడులు చేసినా చేసినతప్పులు బయట పడినా చర్యలు లేకపోవడంతో ధరలు అమాంతంగా పెంచేశారు. ఒక్క రూపాయి తీసుకోము అని చెప్పుకుంటున్నా ప్లానింగ్ సెక్రటరీ,ఎల్. టి. పై. లు కొందరి కనుసన్నల్లో అనుమతుల పర్వం కొనసాగుతుంది. పైసల్ లేనిదే ఒక్క పనిచేస్తే ఒట్టు. ఈ నేపథ్యంలోనే పట్టణములో

ఖాళీ స్థలాలు కొని ఇల్లుకట్టుకునే వారికి చుక్కలు చూపిస్తున్నారు. ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ అప్పుడు ఎప్పుడో అమలు చేసింది. మారుతున్న కాలానికి అనుగుణంగా మాస్టర్ ప్లాన్ అమలు కాకపోవడం,ప్రభుత్వం విధించిన ఆంక్షలు టౌన్ ప్లానింగ్ అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎవరైనా ఇల్లు కట్టుకోవాలంటే 30 అడుగుల రోడ్డు ఉంటే అనుమతులకు ఇబ్బందులు ఉండవు. 30 అడుగులు తక్కువ ఉంటే ,ఎన్ని అడుగులు తక్కువ ఉంటే అంత ప్రభుత్వానికి రాసి ఇవ్వాల్సి ఉంది. యజమానుల పరిస్థితి ఒకవేళ భాగలేకపోతే కట్టు కున్న ఇల్లు అమ్ముకోవాల్సి వస్తే ప్రభుత్వానికి రాసిచ్చిన అడుగులను తీసివేసి కొనుగోలుదారుడు డబ్బు చెల్లిస్తారు. దీంతో యజమాని నష్టపోతాడు, ఈ అవకాశాన్ని మలుచుకుంటు ప్రభుత్వానికి స్థలం రాసివ్వకుండా చేస్తాం,ఏరియా వ్యాల్యూను బట్టి అనుమతులకు తక్కెడ తూకం వేస్తూ లక్షల రూపాయలు లంచం తీసుకుంటున్నారు. పట్టణంలో 42 వార్డుల్లో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ప్రభుత్వ నిబంధనల మేరకు రోడ్లు ఉంటాయి. సందు,గొందుల్లో 30 అడుగుల రోడ్లు ఉన్నాయా చెప్పండి. ఈ సాకు చెపుతూ డబ్బు ఇచ్చినవారికి అనుమతులు,ఇవ్వని వారికి చుక్కలు చూపిస్తున్నారు. ఒకే బజారులో డబ్బు ఇచ్చిన వారికి అనుమతులు ఇస్తున్నారు,డబ్బు ఇవ్వని వారికి అనుమతులు ఇవ్వకపోవడంతో ప్రజలు ఎవరికి పిర్యాదు చేయాలో అర్థం కాని పరిస్థితి. ఎమ్మెల్యే శిల్పా వద్దకు వెళ్లి సామాన్య మానవుడు గోడు వెళ్లబుచ్చాలంటే ఆయన వద్దకు చేరుకోవాలంటే అంత సామాన్య విషయం కాదని ప్రజలు పేర్కొంటున్నారు. కొందరికి మాత్రమే అవకాశం లభిస్తుందని,వారంలో రెండురోజులు వచ్చి ఫుల్ బిజీగా కార్యక్రమాలు ఉండటం వల్ల ప్రజానమస్యలు చెప్పుకోవడానికి విలువుండదు. ఏసీబీ,విజిలెన్స్,ఎమ్మెల్యే అంటే టౌన్ ప్లానింగ్ అధికారులకు భయం లేకపోవడంతో కొందరు ముఖ్యమంత్రి పేషికి సమస్యలను రిజిస్టర్ పోస్ట్ చేయనున్నారు. ప్రజలను లంచాలకు జలగల్లా పీడిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులను బదిలీ అయినా చేయండి. చర్యలన్నా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# నాగార్జున-రాజశేఖర్ కాంబోలో? ఎప్పుడంటే?



కింగ్ నాగార్జున ప్రస్తుతం తనదైన శైలిలో తనకి సెట్ అయ్యే కథలని ఎంపిక చేసుకొని సినిమాలు చేస్తున్నాడు. గత ఏడాది ది ఘోస్ట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకి వచ్చిన నాగార్జున ప్రస్తుతం ప్రసన్నకుమార్ బెజవాడ దర్శకత్వంలో సినిమా చేయడానికి ఒకే చెప్పాడు. త్వరలో ఈ మూవీ అఫీషియల్ గా ప్రారంభం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక యాంగ్రీ యంగ్ మెన్ రాజశేఖర్ కూడా అడపాదడపా సినిమాలు చేస్తున్నాడు. హీరోగా కెరియర్ క్లోజ్ అయ్యే పరిస్థితిలో ఉండటంతో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా టర్న్ తీసుకోవడానికి ప్లాన్ చేస్తున్నాడు. అయితే సరైన సినిమా కోసం వెయిట్ చేస్తున్నాడు. పాన్ ఇండియా లెవల్ ప్రాజెక్ట్ పడితే తన క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా టర్న్ కావడానికి గ్రాండ్ గా ఉంటుంది అని భావిస్తున్నాడు. మరో వైపు కొత్త దర్శకుల కథలు వింటున్నట్లు తెలుస్తుంది. అయితే మార్కెట్ పరంగా రాజశేఖర్ సినిమాలు థియేటర్స్ లో ప్రస్తుతం ఆడటం లేదు. ఇదిలా ఉంటే 15 ఏళ్ళ వెనక్కి వెళ్తే రాజశేఖర్ స్టార్ హీరోగా వరుస సక్సెస్ లు అందుకుంటూ దూసుకుపోయాడు అని చెప్పాలి. డిఫరెంట్ కంటెంట్ కథలతో ప్రేక్షకుల ముందుకి వచ్చి బ్లాక్ బస్టర్ హిట్స్ కొట్టాడు. ఇక నాగార్జున కూడా సక్సెస్ ఫుల్ కెరియర్ ని కొనసాగించాడు. ఆ సమయంలోనే వీరిద్దరి కాంబినేషన్ లో బిగ్ మల్టీ స్టారర్ మూవీ స్టార్ట్ అయ్యిందనే విషయం చాలా మందికి తెలియదు. అయితే ఈ కాంబినేషన్ మూవీని ఇవివి సత్యనారాయణ దర్శకత్వంలో ప్లాన్ చేశారు. ఈ సినిమా ఓపెనింగ్ కార్యక్రమాలు కూడా జరిగాయి. ఇక వెంకట్ అక్కినేని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ లో ఈ సినిమాని నిర్మించడానికి రెడీ అయ్యారు. కథ కూడా ఫైనల్ అయ్యింది. ఇక క్యాస్టింగ్ సెలక్షన్ చేసుకొని సెట్స్ పైకి వెళ్దామని అనుకున్నారు. అయితే ఏవో కారణాల వలన ఈ కాంబినేషన్ వర్క్ అవుట్ కాదని ఆ ప్రాజెక్ట్ పక్కన పెట్టేసారు. తరువాత నాగార్జునతో ఈవీవీ సినిమాలు చేసి హిట్స్ కొట్టాడు కాని రాజశేఖర్ తో మాత్రం కెరియర్ లో ఒక్క సినిమా మాత్రమే చేసాడు. అది కూడా డిజాస్టర్ అయ్యింది. ఏది ఏమైనా నాగార్జున రాజశేఖర్ కాంబినేషన్ లో రావాల్సిన బిగ్ మల్టీస్టారర్ మూవీ ఆ రోజుల్లో ఎందుకు ఆగిపోయింది అనేది ఎవరికి తెలియదు.

# వాల్తేరు వీర సింహా.. 25రోజుల్లో వసూళ్లు ఎంతంటే?

రీసెంట్గా సంక్రాంతి రిలీజైన సినిమా జోరు తగ్గింది. ఇక కలెక్షన్స్ మెల్లగా తగ్గిపోయాయి. కొత్త చిత్రాలు కూడా థియేటర్లలోకి వచ్చేశాయి. అయితే దీంతో సంక్రాంతికి ఒకరోజు గ్యాప్లో రిలీజైన మెగాస్టార చిరంజీవి వాల్తేరు వీరయ్య బాలయ్య వీర సింహా రెడ్డి దాదాపు 25రోజులు పూర్తిచేసుకున్నాయి. తాజాగా ఈ చిత్రాల కలెక్షన్స్ వివరాలు బయటకు వచ్చాయి. మెగాస్టార్ చిరంజీవి మాస్ మహారాజా రవితేజ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. బాబీ దర్శకుడు. సంక్రాంతి కానుకగా జనవరి 13న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ను షేక్ చేసింది. బ్లాక్ బస్టర్ హిట్ టాక్ను అందుకున్న ఈ చిత్రం తొలి



రోజు నుంచి అదిరిపోయే వసూళ్లను అందుకుంది. అయితే ఈ చిత్రం విడుదలై 24 రోజులు పూర్తి చేసుకుంది. తాజాగా 24వ రోజు రూ. 65లక్షలు వసూలు చేసింది. మొత్తంగా 24 రోజుల్లో తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ తెలంగాణ కలిపి.. ఏరియాల వారిగా కలెక్షన్స్ ఈ విధంగా ఉన్నాయి. నైజంలో రూ. 35.82 కోట్లు సీడెడ్ లో రూ. 18.09 కోట్లు ఉత్తరాంధ్రలో రూ. 19.06 కోట్లు ఈస్ట్ లో రూ. 12.90 కోట్లు రూ. వెస్ట్ లో రూ. 7.08 కోట్లు గుంటూరులో రూ. 9.11 కోట్లు కృష్ణ లో రూ. 7.66 కోట్లు నెల్లూరులో రూ. 4.57 కోట్లు.. మొత్తంగా రూ. 114.39 షేర్ రూ. 185.08 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. వరల్డ్ వైడ్గా.. ఈ సినిమా తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా మిగతా చోట్ల కూడా మంచి వసూళ్ళను అందుకుంది. వరల్డ్ వైడ్గా వాల్తేరు వీరయ్య రూ. 135.77 కోట్ల షేర్ కలెక్షన్స్ అందుకోగా.. 231.80 కోట్ల రేంజ్లో గ్రాస్ కలెక్షన్స్ వచ్చాయట. ఇకపోతే ఈ చిత్రం వరల్డ్ వైడ్గా రూ. 88 కోట్ల రేంజ్లో ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగింది. అంటే ఈ మూవీ బ్రేక్ ఈవెన్ రూ. 89 కోట్లు. ఇప్పుడు ఈ సినిమా మొత్తంగా షేర్ కలెక్షన్స్ రూ. 135 కోట్లు రావడంతో ఇప్పుడీ చిత్రం రూ. 47 కోట్ల వరకు లాభం సంపాదించింది. 25రోజుల్లో వీరసింహారెడ్డి... గోపిచంద్ మలినేని దర్శకత్వంలో నటసింహం నందమూరి బాలకృష్ణ -హనీరోజ్-శ్రుతిహాసన్ కలిసి నటించిన వీరసింహారెడ్డి జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ గా నిలిచింది. ఇక ఈ సినిమా విడుదలై 25రోజులు అయింది. .... బాక్స్ ఆఫీసు వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తుంది. అయితే ఈ చిత్రం నాలుగు రోజుల్లో రూ. 26లక్షలను అందుకుంది. మొత్తంగా 25 రోజుల కలెక్షన్స్ చూసుకుంటే.. నైజాం 17.31కోట్లు సీడెడ్ రూ. 16.50 కోట్లు ఉత్తరాంధ్ర రూ. 8.55 కోట్లు తూర్పు గోదావరి రూ. 6.60 కోట్లు పశ్చిమ గోదావరి రూ. 4.90 కోట్లు గుంటూరు రూ. 7.42 కోట్లు కృష్ణ రూ. 4.73 కోట్లు నెల్లూరు రూ. 3.00 కోట్లు వసూలు చేసింది. రెండు తెలుగు రాష్ట్రాలు కలిపి రూ. 69.01 కోట్లు (రూ. 112.25 కోట్లు గ్రాస్)గా ఉంది. కర్ణాటక ప్లస్ ఇతర ప్రాంతాలు రూ. 4.85 కోట్లు ఓవర్సీస్ రూ. 5.77 కోట్లు ప్రపంచ వ్యాప్తంగా 25 రోజులు కలిపి చూస్తే.. రూ. 79.63 కోట్లు షేర్ (రూ. 133.55 కోట్లు గ్రాస్) వసూళ్లు వచ్చాయి. ఇకపోతే 74 కోట్ల రేంజ్ బ్రేక్ ఈవెన్ టార్గెట్ తో బరిలోకి దిగింది సినిమా. 5.63 కోట్ల ప్రాఫిట్ పొందింది.

# అందమైన ఈ "రెడ్డి హీరోయిన్" ఎవరు... సెర్చ్ చేస్తున్న యువత



కలర్ ఫోటో సినిమాతో హీరోగా మారిన సుహాస్.. తాజాగా నటించిన చిత్రం రైటర్ పద్మభూషణ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే ఆ సినిమాలో కీలక పాత్రలో కనిపించిన గౌరీ ప్రియా రెడ్డి మంచి మార్కులే కొట్టేసింది. తన అందం అభినయంతో అందరినీ మెప్పించిన ఈ ముద్దుగుమ్మ గురించి నెట్టింట తెగ టాక్ నడుస్తోంది. అసలెవరీ అమ్మాయి అంతకు ముందు ఏ సినిమాల్లో కనిపించిందని గూగల్ లో సెర్చ్ చేస్తున్నారు. అయితే మెయిల్ అనే సినిమాతో సినీ రంగంలోకి అడుగు పెట్టిన ఈ ముద్దుగుమ్మ తెలుగు అమ్మాయే కావడం గమనార్హం. గమనార్హం అని ఎందుకు అంటున్నామంటే తెలుగు అమ్మాయి సినీ పరిశ్రమలో రాణించడం అందులోనూ హీరోయిన్ గా నిలవడం చాలా అరుదు కాబట్టి. మెయిల్ సినిమాతో ఎంట్రో ఇచ్చిన ఈ బ్యూటీ మొదటి సినిమాతోనే మంచి మార్కులు దక్కించుకుంది. కానీ ఆ తర్వాత ఆమె మరెక్కడా కనిపించలేదు. అయితే తాజాగా రైటర్ పద్మభూషణ్ సినిమాలో కనిపించి మాయ చేసేసింది. సినిమా కథ మొత్తాన్ని మార్చి మలిచే పాత్రలో మెరిసింది. రైటర్ పద్మభూషణ్ సినిమాలో సుహాస్ టీనా శిల్ప రాజు పాత్రలతో సమానంగా గౌరీ ప్రియ పాత్రకు కూడా మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. అయితే గౌరీ ప్రియా రెడ్డి తెలుగు అమ్మాయి కావడంతో ఆమె గురించి తెలుగు వారందరూ తెలుసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అందుకే చిన్నప్పుడే బోల్ బేబీ బోల్ షోలో పాల్గొన్న గౌరీ ప్రియా రెడ్డి త్రావత ఒక బ్యూటీ కాంటెస్ట్ లో గెలిచిన తర్వాత నటన మీద ఆసక్తి పెంచుకొని నటన వైపు అడుగులు వేశారు. ఈ క్రమంలోనే సినిమాల్లో నటించేందుకు.. రకరకాల ప్రయత్నాలు చేసింది. ముందుగా మెయిల్ సినిమాలో ఛాన్స్ దక్కించుకొని కనిపించింది. కేవలం సినిమాల్లోనే కాకుండా సోషల్ మీడియాలో కూడా ఈమె యాక్టివ్ గానే ఉంటుంది. ఈ ముద్దుగుమ్మ నటి మాత్రమే కాదండోయ్ మంచి సింగర్ కూడా. అలాగే 2018లో మిస్ హైదరాబాద్ కిరీటాన్ని కూడా గెలుచుకుందీ క్యూట్ బ్యూటీ.

# పార్ల్ రాయల్స్ జట్టులోకి ఐర్లాండ్ విధ్వంసకర ఆటగాడు



సౌతాఫ్రికా టీ20 లీగ్-2023కు వెస్టిండీస్ స్టార్ పేసర్ ఒబెడ్ మెకాయ్ గాయం కారణంగా దూరమై సంగతి తెలిసిందే. గతేడాది జరిగిన వేలంలో మెకాయ్‌ను పార్ల్ రాయల్స్ కొనుగోలు చేసింది. అయితే ఈ టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా అతడు ఆడలేదు. ఈ క్రమంలో మెకాయ్ స్థానాన్ని ఐర్లాండ్ స్టార్ బ్యాటర్ పాల్ స్టిర్లింగ్‌తో పార్ల్ రాయల్స్ భర్తీ చేసింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా రాయల్స్ మెనేజెమెంట్ వెల్లడించింది. ఇక ఫిబ్రవరి 7న ప్రిటోరియా క్యాపిటల్స్‌లతో పార్ల్ రాయల్స్ తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో తలపడనుంది. ఈ మ్యాచ్ జట్టు సెలక్షన్‌కు స్టిర్లింగ్ అందుబాటులో ఉండనున్నాడు. ఇక స్టిర్లింగ్ ఇంటర్నేషనల్ టీ20 లీగ్‌లో కూడా భాగమయ్యాడు. ఈ టోర్నీలో అబుదాబి నైట్‌రైడర్స్‌కు ప్రాతినిథ్యం వహించిన అతడు 6 మ్యాచ్‌ల్లో 168 పరుగులు చేశాడు. అయితే ప్లే ఆఫ్స్‌కు నైట్‌రైడర్స్ అర్హత సాధించడంలో విఫలమైంది. ఇక ఓవరాల్‌గా తన కెరీర్‌లో 120 టీ20లు ఆడిన అతడు 3181 పరుగులు చేశాడు

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**